ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 30 అక్టోబరు 2025



నేడు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రైళ్ల రద్దు కొనసాగుతోంది. గురువారం కూడా పలు రైళ్లను రద్దు చేశారు. కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), కోరాపుట్-విశాఖ పాసింజర్ (58537), షాలిమార్-చర్లపల్లి ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా (12704) ఉన్నాయి. బుధవారం పాండిచ్చేరి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ (20852), సికింద్రాబాద్-విశాఖ దురంతో (22204) రద్దయ్యాయి. విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20833), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20834), చర్లపల్లి-షాలిమార్ ఈస్ట్ కోస్ట్ (18046) రైళ్లను బుధవారం మళ్లింపు మార్గంలో నడిపారు.



తుఫాను గాలులకు ఆర్కే బీచ్‌లో ఊగిసలాడుతున్న కొబ్బరి చెట్లు

నేడు పాఠశాలలకు సెలవు

- అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా...
- కళాశాలలు యథావిధిగా పనిచేస్తాయని సంబంధిత వర్గాల వెల్లడి

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటి బలహీనపడినా ఇంకా వర్షాలు కురిసే వాతావరణం కొనసాగుతున్నందున గురువారం జిల్లాలోని పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సెలవు ప్రకటించారు. అయితే జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు యథావిధిగా పనిచేస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా ప్రధానోపాధ్యాయులు విధిగా గురువారం తాము పనిచేసే పాఠశాలలకు వెళ్లాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. పాఠశాలల్లో గదులు, పరిసరాలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరంగా ఏమైనా పనులు చేపట్టాలన్నా, ఇతరత్రా సమస్యలున్నా జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు భిన్నంగా ప్రైవేటు పాఠశాలలు గురువారం తెరిచి తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్కే బీచ్‌లో పెరల్ హోటల్ వద్ద తీరం కోతకు గురికాకుండా, రాళ్లు జారకుండా నియంత్రణ చర్యలు చేపట్టిన దృశ్యం

తప్పిన మొంథా ముప్పు

తగ్గుముఖం పట్టిన వర్షాలు

- ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు
- పడిపోయిన చెట్లు తొలగింపు
- విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ
- బాధిత కుటుంబాలకు నిత్యావసరాల సరఫరా
- అధికారుల ముందస్తు ఏర్పాట్లతో మెరుగైన ఫలితాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అధికారులు సహాయక కార్యక్రమాలు వేగవంతం చేశారు. నగరంలో రహదారులకు అడ్డంగా పడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేసి సరఫరా పునరుద్ధరించారు. కూలిపోయిన గోడల వద్దకు ఎవరూ వెళ్లకుండా అడ్డంకులు ఏర్పాటు చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని కూడా ప్రాథమికంగా అంచనా వేశారు. వరద బాధిత ప్రాంతాల్లో ప్రభావిత కుటుంబాలకు నిత్యవసర సరకులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా వర్షాల వల్ల సముద్రంలో వేటకు వెళ్లకుండా ఆగిపోయిన మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం ఇస్తామని తెలిపింది.

నష్టం ఎంత అంటే...?

తుఫాన్ కారణంగా ఆర్థికంగా ఎంత నష్టం జరిగిందనేది అధికారులు ఇంకా అంచనా వేయలేదు. జిల్లాలోని 11 మండలాల్లో ఈ నాలుగు రోజుల్లో సగటున 3.7 సెం.మీ. వర్షపాతం కురిసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో మేహాద్రి, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లు ఉండగా అన్నింటిలోను నీరు బాగా చేరింది. మండలాల్లో తుఫాన్ బాధితుల కోసం 83 శిబిరాలు ఏర్పాటు చేయగా 21,584 మందిని తరలించాల్సి ఉంటుందని అంచనా వేశారు. అయితే తుఫాన్ తీరం దాటిన తరువాత వర్షాలు పెద్దగా

... మిగతా 6వ పేజీలో

మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ విశాఖ జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

ప్రాంతం	వర్షపాతం (మి.మీ.లు)
పద్మనాభం	81.4
భీమునిపట్నం	72.75
అక్కిరెడ్డిపాలెం	67.25
వేపగుంట	59.5
గోస్తనీ పంపుహౌస్	59.25
పరదేశిపాలెం	58
పెందుర్తి	56.75
ఆనందపురం	52



తుఫాన్ వర్షాల ధాటికి విశాలాక్షినగర్‌లో కూలిపోయిన గోడ

నష్టం రూ.8.07 కోట్లు

ప్రభుత్వానికి జీవీఎంసీ నివేదిక

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జీవీఎంసీ పరిధిలో రూ.8.07 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం ప్రాథమిక నివేదిక పంపించారు. భారీవర్షాలకు 10.1 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు గుర్తించారు. నష్టం సుమారు రూ.7.12 కోట్లు వరకు ఉంటుందని అంచనా వేశారు. అలాగే ఓపెన్ డ్రెయిన్లు, గెడ్డలు సుమారు 2.5 కిలోమీటర్లు మేర దెబ్బతిన్నట్టు గుర్తించారు. మరమ్మతులకు రూ.83.6 లక్షలు అవుతాయని అంచనా వేశారు. ఇంకా పాఠశాలలు, సామాజిక భవనాలు, జీవీఎంసీకి చెందిన భవనాలు పాక్షికంగా దెబ్బతినడంతో వాటి మరమ్మతులకు రూ.7.3 లక్షల వరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుందంటున్నారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. దీనివల్ల సుమారు 4.96 లక్షల వరకు నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ప్రాథమికంగా గుర్తించిన నష్టం వివరాలు, మరమ్మతులకు అయ్యే ఖర్చుల వివరాలతో కూడిన నివేదికను చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజు జీవీఎంసీ కమిషనర్‌కు అందజేయగా, ఆయన ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది.



వుడా చిల్డ్రన్స్ ఎరీనా వద్ద విరిగిపోయిన చెట్టు కొమ్మను కత్తిరిస్తున్న సిబ్బంది

నేడు తేలికపాటి జల్లులు

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తీవ్ర తుఫాన్ తీరం దాటి తెలంగాణ మీదుగా ఒడిశా, చత్తీస్‌గఢ్ వైపు వెళ్లే క్రమంలో వాయుగుండంగా బలహీనపడినా దాని ప్రభావంతో నగరం, పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ముసురు వాతావరణం కొనసాగింది. తెల్లవారుజామున ఒక మోస్తరు వర్షం కురిసింది. రోజంతా దఫదఫాలుగా జల్లులు పడ్డాయి. వర్షానికి తోడుగా బలమైన గాలులు వీచాయి. గడచిన మూడు, నాలుగు రోజులగా కురుస్తున్న వర్షాలకు తీరం పలుచోట్ల కోతకు గురైంది. కాగా వాయుగుండం బుధవారం రాత్రికి దక్షిణ చత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాల్లో కొనసాగుతుండడంతో సముద్రం నుంచి వాయుగుండం దిశగా తేమగాలులు వీచే అవకాశం ఉంది. దీంతో గురువారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

230 బస్సులు రద్దు

- ఘాట్‌రోడ్లు సహా పలు మార్గాల్లో సర్వీస్‌లు నిలిపివేత
- మిగిలిన బస్సుల్లో ఆక్యుపెన్సీ 50 శాతమే...

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీవర్షాలు కురుస్తుండడంతో బుధవారం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం జిల్లాలో 230 బస్సులు రద్దు చేసింది. ఘాట్‌రోడ్లతో పాటు వర్షాల కారణంగా బాగా రోడ్లు దెబ్బతిన్న రూట్‌లలో సర్వీస్‌లు నిలిపివేసింది. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా సురక్షిత రూట్లలో మాత్రమే సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్టీసీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు జూమ్ మీటింగ్‌లో ఇచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకొని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

గుణుపూరు, భద్రాచలం, సీలేరు, అరకులోయ, ఇంద్రావతి, పాడేరు రూట్లలో రాకపోకలు సాగించాల్సిన బస్సులను రద్దు చేసింది. అలాగే విశాఖ రీజియన్‌లో సింహాచలం కొండపైకి బస్సులను రద్దు చేసింది. రూట్లు బాగున్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ లేకపోవడంతో శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, రాజాం ప్రాంతాలకు అనేక సర్వీస్‌లు రద్దు చేశారు. సిటీలో కూడా కొన్ని బస్సులను డిపోల్లోనే నిలిపివేశారు. సాయంత్రం 6.30 గంటల తరువాత ప్రయాణికుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.

ఆక్యుపెన్సీ రేషియో 50 శాతం

విశాఖ రీజియన్‌లో 740 బస్సులు ఉండగా వర్షం కారణంగా అందులో 230 బస్సులను బుధవారం అధికారులు రద్దు చేశారు. ఇక మిగిలిన 510 బస్సులను ఉదయం 6.00 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నడిపారు. అయినా సగటు ఆక్యుపెన్సీ రేషియో 50 శాతంగా నమోదయ్యింది.



నగరంలో బుధవారం ఉదయం వర్షం

13,000 మంది మత్స్యకారులకు నిత్యావసర సరుకులు

- బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, పంచదార, బంగాళాదుంపలు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశం
- 1516 మంది నిరాశ్రయులకు కూడా...

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని 13 వేల మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, పంచదార, బంగాళాదుంపలు, వంట నూనె కిలో వంతున అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో సముద్రంలో వేటకు వెళ్లని మత్స్యకారులను గుర్తించి సాయం అందించేందుకు వీలుగా జాబితాలు సిద్ధం చేయాలన్నారు. ఇదిలావుండగా తుఫాన్ ప్రభావంతో సముద్రతీర, లోతట్టు, కొండవాలులో నివాసం ఉండే 1,516 మందిని 16 పునరావాస కేంద్రాలకు తరలించారు. వారిలో ప్రతి ఒక్కరికీ రూ.1000 నగదు, కుటుంబానికి గరిష్ఠంగా రూ.మూడు వేల వంతున సాయం అందించనున్నారు. ఇంకా 25 కిలోల బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, పంచదార, బంగాళాదుంపలు కేజీ వంతున, కిలో వంట నూనె ఇచ్చేందుకు ఏర్పాట్లుచేయాలని జేసీ ఆదేశించారు.

తస్మాత్ జాగ్రత్త!


ఆర్‌టీఓ చలాన్ పేరుతో మాల్వేర్

- వాట్సాప్‌లో ఓపెన్ చేస్తే మొబైల్ హ్యాంగ్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాట్సాప్ గ్రూపుల ద్వారా 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. "మీ వాహనంపై ఈ-చలాన్ జనరేట్ అయింది. వెంటనే చెక్ చేసుకోండి. లేదంటే మీపై కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. దీంతో పాటు వచ్చిన 'ఆర్‌టీఓ ఏపీకే'(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్) ఇన్‌స్టాల్ చేసుకొని చలానా చెక్ చేసుకొండి... ఫ్రమ్, ఆర్‌టీఓ ఆఫీస్" అంటూ మెసేజ్ వస్తోంది. దాంతో పాటే 'ఈ-చలాన్ ఆర్‌టీఓ... ఏపీకే' అని వస్తోంది. చలానా ఎక్కడ పడింది?, ఎంత వేశారు?... తెలుసుకోవాలన్న ఆత్రంతో పొరపాటున ఆ అప్లికేషన్ ఓపెన్ చేస్తే ప్రమాదమే. అది అనేక పర్మిషన్లు అడుగుతుంది. అవన్నీ ఓకే చేసుకుంటూ పోతే..'వలంటీర్స్ గ్రూపు' అని ఒకటి ఆటోమేటిక్‌గా మొబైల్‌లో జనరేట్ అవుతోంది. అందులో కూడా ఇదే అప్లికేషన్ వస్తోంది. అది ఆ మొబైల్ నుంచి ఇతర వ్యక్తులకు పంపించకుండానే ఫార్వర్డ్ అవుతోంది.

నష్టం ఏమిటంటే...

మొబైల్ ఖరీదైనది, మాల్వేర్‌ను అడ్డుకునే శక్తి కలది అయితే ఫర్వాలేదు. లేదంటే వాట్సాప్ హ్యాంగ్ అయిపోతుంది. పనిచేయదు. మరికొందరికి ఫోన్‌లో బ్యాటరీ చాలా త్వరగా డ్రెయిన్ అయిపోతుంది. ఫుల్ చార్జింగ్ చేసినా అరగంటలోనే 20 శాతానికి వచ్చేస్తుంది. వెంటనే సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లి మాల్వేర్‌ను తొలగించి, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించుకోవలసి వస్తుంది. ఈ క్రమంలో ఫోన్‌లో డేటా పోతుంది. సరైన పాస్‌వర్డ్‌లు లేకపోతే అకౌంట్లో డబ్బులు కూడా మాయమైపోయే ప్రమాదం ఉంది. కాబట్టి మొబైల్‌లో 'ఆర్‌టీఓ ఈ-చలానా' పేరుతో వచ్చే అప్లికేషన్ ఓపెన్ చేయకండి. దీనిపై సైబర్ పోలీసులు కూడా దృష్టి పెట్టి ప్రచారం చేయాల్సి ఉంది.



వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్

జలకళ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి నీటిని అందించే రిజర్వాయర్లు మొంథా తుఫాన్ ప్రభావంతో నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. భారీవర్షాల కారణంగా ఎగువ నుంచి వరదనీరు పోటెత్తుతుండడంతో రిజర్వాయర్లు జలకళ సంతరించుకున్నాయి. తాటిపూడి, మేహాద్రిగెడ్డలో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో గేట్లను తెరిచి నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. మిగిలిన రిజర్వాయర్లలో ఇన్‌ఫ్లో ఆధారంగా నిర్ణయం తీసుకునేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నిండిన రిజర్వాయర్లు

- మొంథా తుఫాన్ ప్రభావంతో భారీగా ఇన్‌ఫ్లో
- గరిష్ఠ స్థాయికి చేరువైన నిల్వలు
- మేహాద్రిగెడ్డ, తాటిపూడి నుంచి దిగువకు నీరు విడుదల
- వచ్చే వేసవిలో నీటి ఎద్దడి ఉండబోదని జీవీఎంసీ అధికారుల వెల్లడి

నగర వాసులకు తాగునీరు, పరిశ్రమల అవసరాలను తీర్చే రిజర్వాయర్లలో ఏలేరు, రైవాడ, తాటిపూడి, మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్లు ప్రధానమైనవి. వాటి నుంచి తాగునీటి కోసం ప్రతిరోజూ 70 ఎంజీడీలు, పరిశ్రమలకు 24 ఎంజీడీలు నీటిని తరలిస్తారు. ఇక ఏలేరు, రైవాడ, తాటిపూడి రిజర్వాయర్ల నుంచి వ్యవసాయానికి నీటిని విడుదల చేస్తుంటారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటినే ఏడాది పొడవునా తాగు,సాగు, పరిశ్రమల అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. జనవరి, ఫిబ్రవరి వరకూ పెద్దగా ఇబ్బంది లేకపోయినా, మార్చి నుంచి నీటి వినియోగం భారీగా పెరుగుతుంది. ఒక్కో ఏడాది వేసవిలో కొళాయిల ద్వారా నీటిని విడుదల చేసే సమయం గణనీయంగా తగ్గిపోతుంది. కొండవాలు, శివారు ప్రాంతాల్లో రెండు రోజులకొకసారి కొళాయిలు ఇచ్చే పరిస్థితి తలెత్తుతుంది. అయితే ఈసారి మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి.

రిజర్వాయర్లలో నీటి మట్టాలు (బుధవారం ఉదయానికి...)

రిజర్వాయర్	గరిష్ఠం	ప్రస్తుతం
ఏలేరు	86.56 మీటర్లు	85.38 మీటర్లు
రైవాడ	114 మీటర్లు	112.86 మీటర్లు
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	58.7 అడుగులు
తాటిపూడి	297 అడుగులు	294.4 అడుగులు
ముడసర్లోవ	169 అడుగులు	159.03 అడుగులు
గంభీరం	126 అడుగులు	123.04 అడుగులు



నిండుగా ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్

రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల

తాటిపూడి, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లలో నీటి మట్టం బుధవారం నాటికి గరిష్ఠ స్థాయికి చేరడంతో గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువైంది. ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 86.56 మీటర్లు కాగా బుధవారం ఉదయానికి 85.38 మీటర్లకు చేరింది. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. ఇక తాటిపూడి రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 297 అడుగులు కాగా మంగళవారం నాటికి 294.8 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వరద నీరు భారీగా వస్తుండడంతో అధికారులు గేట్లు ఎత్తినీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయానికి 294.4 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో వచ్చే ఏడాది వేసవిలో నీటి ఇబ్బందులు తప్పినట్టేనని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.


తగరపువలస సమీపంలోని కీచిన్‌పేట వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

సింహగిరిపై కూలిన చెట్లు

సింహాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. బస్టాండ్‌లో భక్తుల నీడ కోసం వేసిన పెండాళ్లు, రెండవ ఘాట్ రోడ్డు సమీపంలో మూడు చెట్లు విరిగిపడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా దేవస్థానం సెక్యూరిటీ గార్డులు స్థానికుల సహకారంతో కూలిన చెట్లను తొలగించారు. అలాగే 98వ వార్డు లండగరువులో కూలిన చెట్లను కార్పొరేటర్ పీవీ నరసింహం స్వయంగా తొలగించారు.


సింహాచలంలో కూలిన చెట్టు


ఎండాడ : ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి వర్షం నీరు భారీగా చేరింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో పాఠశాల ప్రవేశద్వారం వద్ద నిలిచిపోయింది. అధికారులు తక్షణమే నీరు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కూలిన భారీ వృక్షం

తగరపువలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి తగరపువలస వెళ్లే ప్రధాన రహదారిలో కీచిన్‌పేట వద్ద భారీ వృక్షం బుధవారం కూలిపోయింది. దీంతో మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. చెట్టు కాండం భాగం పూర్తిగా నానిపోవడంతో కూలిపోయినట్టు కమిషనర్ చెప్పారు.

నిర్మానుష్యంగా పర్యాటక ప్రాంతాలు


నిర్మానుష్యంగా రుషికొండ బీచ్

సాగర్‌నగర్, విశాలాక్షినగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లోకి సందర్శకులను బుధవారం కూడా అనుమతించలేదు. దీంతో బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి. తుఫాను తీరం దాటడంతో అలల తాకిడి తగ్గింది. తీర గ్రామాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొండవాలు ప్రాంతాలు బాగా నాని ఉండడంతో బండరాళ్లు జారి కింద పడే ప్రమాదం ఉందని, నివాసితులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అలాగే కైలాసగిరి, తెన్నేటీ పార్కు, జోడుగుళ్లపాలెం తీరంతో పాటు సీతకొండ టర్నింగ్ కూడా బోసిపోయాయి. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్శకులు నిరాశతో వెనుతిరిగారు.

నిరాశ్రయులకు చేయూత

తగరపువలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాను వల్ల భీమిలి పరిసర ప్రాంతాల్లో వృద్ధులు,నిరాశ్రయులు సహాయం కావాలంటే తమను సంప్రతించాలని కేథరిన్ విద్యా సంస్థల అధిపతి ఆలీవర్ రాయి కోరారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితులు 8328078337 సెల్ నంబరును సంప్రతిస్తే అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.

నిత్యావసర సరకులు పంపిణీ


సరకులు అందిస్తున్న తహశీల్దార్ శ్రీనుబాబు

ఆనందపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తర్లువాడ పంచాయతీలో జరిగిన నష్టాన్ని సర్పంచ్ నాయుడు, తహశీల్దార్ శ్రీనుబాబు పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, కొట్టుకుపోయిన గెడ్డలు, పంటలు చూశారు. అనంతరం పంచాయతీలోని బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తటరాజు అప్పారావు, జనసేన నాయకుడు మజ్జి శ్రీను, బంకు రాజు పాల్గొన్నారు.

తుఫాన్ మిగిల్చిన నష్టం


చిల్లపేటలో బాధితుల్ని పరామర్శించి, నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

- ఎడతెరిపిలేని వర్షాలతో పొంగిన గెడ్డలు, వాగులు
- ఈదురుగాలులకు ఎక్కడికక్కడ కూలిన చెట్లు
- సందర్శనీయ ప్రాంతాలపై కొనసాగిన నిషేధం
- ముంపు ప్రాంతాల్లో నాయకుల పర్యటన

మొంథా తుఫాన్ నియోజకవర్గంలోని ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ చెట్లు కూలిపోగా, బొప్పాయి, తదితర పంటలు నేలరాలాయి. మరోవైపు మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా పడిన వర్షాలకు గోస్తనీ నది, గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నారు. గోస్తనీ పరీవాహక ప్రాంతాల్లో పలుచోట్ల లోతట్టు గ్రామాలు, పంట పొలాలు నీట మునిగాయి.

బోయవీధిని సందర్శించిన ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయవీధిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొందరి నివాసాల్లోకి వెళ్లి ఇళ్లు కారిపోతుండడాన్ని గమనించారు.పది కుటుంబాలు శిథిలమైన ఇళ్లలో ఉంటున్నారని, తక్షణమే వారిని సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించాలని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును ఆదేశించారు.అలాగే బోయవీధి వద్ద కోతకు గురవుతున్న రోడ్డును పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మత్స్యకార నాయకులు కొక్కిరి అప్పన్న, కాసరపు నాగరాజు, మారోజు సంజీవికుమార్, కొప్పల కృష్ణ, కనకల అప్పలనాయుడు, కంచర్ల కామేశ్, సదానంద, మహంతి శివాజీ, గురునాథరావు పాల్గొన్నారు.


బోయవీధిలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

చిల్లపేట, జీరుపేటలో పర్యటన

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని చిల్లపేట, జీరుపేటలో చెరువులోకి చేరాల్సిన వ్యర్థాలు, మురుగు నీరు ఇళ్ల మధ్యలోకి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చిల్లపేట చెరువు వల్ల దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని, తుఫాను వల్ల మరిన్ని ఇబ్బందులు వచ్చాయని నివాసితులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అధికారులతో కలిసి బుధవారం ఆప్రాంతంలో పర్యటించారు. వివిధ ప్రాంతాల్లోని కాలువల ద్వారా మురుగు నీరు చెరువులో చేరుతోందని, దీనివల్ల విపరీతమైన దుర్గంధం వస్తోందని స్థానికులు చెప్పారు. కాలువలు పూడికపోవడంతో మురుగు నివాసాల ముందు నిలిచిపోతుందని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మురుగు నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని జడ్సీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన


నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం,పద్మనాభం రూరల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టం అంచనాలు రూపొందించాలని మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి ఏఓ చలంను ఆదేశించారు. బుధవారం ఆమె పాండ్రంగి వద్ద గోస్తనీ ప్రవాహానికి నీట మునిగిన కాజ్‌వే, పద్మనాభం - శొంఠ్యాం రోడ్డులో మద్ది పల్లిగెడ్డపై ఉన్న కాజ్ వేను పరిశీలించారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలను అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్యారోగ్య శాఖ ద్వారా 16 సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. చిన్నాపురం జంక్షన్‌లో ముంపునకు గురైన రోడ్డులో నీటిని తొలగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. ఆమెతో పాటు ఎంపీడీఓ రూపేష్, ఏఓ చలం ఉన్నారు. అలాగే అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు గ్రామాల్లో పర్యటించి వరి పంటను పరిశీలించారు. పంట పొట్ట దశ, పూత దశల్లో చేపట్టాల్సిన మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ సరిత, డాక్టర్ వి. గౌరి, రామలక్ష్మి, శిరీష, ఏఓ చలం పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో నేలకూలిన బొప్పాయి చెట్లు


ఐదు ఎకరాల్లో బొప్పాయి పంట ధ్వంసం


భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలో మొకర పైడినాయుడుకు చెందిన ఐదు ఎకరాల బొప్పాయి తోట ధ్వంసమైంది. గాలులకు చెట్లన్నీ నేలకూలాయి. పడిపోయిన చెట్లకు 200 కాయలు పక్వానికి వచ్చినవి ఉన్నాయని రైతు తెలిపారు. తోట ఏపుగా ఎదగడానికి ఏడాది పట్టిందని, పంట నేలకూలిపోవడంతో అపార నష్టం జరిగిందన్నారు. ఉద్యానవనశాఖాధికారులు పరిశీలించి, ఆదుకోవాలని ఆయన కోరారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న గంటా రవితేజ, కార్పొరేటర్ హేమలత

కొమ్మాది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని పిపి-2 కాలనీ వద్ద చెరువు నిండిపోవడంతో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ బుధవారం కాలనీలో పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు అందించాలని, డ్రైనేజీలను శుభ్రం చేసి, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా గతంలో చెరువు నిండినా అవుట్ లెట్ ద్వారా నీరు బయటకు వెళ్లిపోయేదని, కొంతమంది నీటి ప్రవాహం వెళ్లకుండా ప్రహరీ గోడలు నిర్మించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు చెప్పారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని రవితేజ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యార్లగడ్డ జీవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


చిమిడిపల్లి వద్ద బండరాళ్లు పడి మూసుకుపోయిన టన్నెల్


ట్రాక్‌పై బండరాళ్లు తొలగించిన తరువాత టన్నెల్

కేకే లైన్ క్లియర్

గంటల వ్యవధిలోనే ట్రాక్‌పై మట్టి, రాళ్లు తొలగింపు

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ముందుగానే అవసరమైన ప్రాంతాలకు సహాయక బృందాలు, అవసరమైన సామగ్రిని తరలించడంతో కొద్దిగంటల్లోనే ట్రాక్ క్లియరెన్స్ చేయగలిగారు. భారీవర్షాలు కురిసినప్పుడు కొత్తవలస-కిరండూల్ మార్గంలో కొండ చరియలు విరిగి మట్టి, రాళ్లు ట్రాక్‌పైకి వచ్చి చేరుతుంటాయి. ఈసారి కూడా అలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే ఆయా ప్రాంతాలకు బృందాలను తరలించారు. మంగళవారం రాత్రి చిమిడిపల్లి వద్ద బండరాళ్లు ట్రాక్‌పై పడి కొన్ని టన్నెల్‌లోకి వెళ్లాయి. దాంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమాచారం అందిన వెంటనే సమీపంలోనే ఉన్న సహాయక బృందాలు వెళ్లి గంటల వ్యవధిలోనే రాళ్లను తరలించి ట్రాక్, టన్నెల్‌ను క్లియర్ చేశాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లను రెండు రోజుల నుంచి నడపడం లేదు. కేవలం గూడ్స్ రైళ్లనే నడుపుతున్నారు. 24 గంటల తరువాత పాసింజర్ రైళ్లను కూడా అనుమతిస్తామని వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు.

శిథిలావస్థలో వాంబే కాలనీ గృహాలు

మధురవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ వాంబేకాలనీ నివాసితులు తుఫాను మూడు రోజులు భయం భయంగా కాలం వెల్లదీశారు. ఇళ్లు శిథిలావస్థలో ఉండడంతో వర్షాలకు ఎక్కడ కూలిపోతాయోనని భయపడ్డారు. ఇళ్ల పోర్టుకోలు రెండు రోజులుగా పెచ్చులూడిపడుతున్నాయి. గతంలో వర్షాలు పడినపుడు కూడా పోర్టికో కూలిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రస్తుతం గోడలు నాని ఉండడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


పూర్తిగా పాడైన వాంబే కాలనీలోని గృహాలు

తప్పిన మొంథా ముప్పు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో 16 శిబిరాలను మాత్రమే ఉపయోగించారు. వాటిలోకి 1,516 మందిని తరలించారు. జిల్లాలో 22 ఇళ్లకు నష్టం వాటిల్లింది. అలాగే 21 గ్రామాల్లో 10.7.7 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. దీనివల్ల 383 మంది రైతులు నష్టపోయారు. సుమారు 160 చెట్లు కూలిపోగా, వాటన్నింటినీ పక్కకు తొలగించారు. పది విద్యుత్ స్తంభాలు పడిపోగా వాటిని కూడా పునరుద్ధరించారు. జిల్లాలో 27 ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోగా, మళ్లించే చర్యలు తీసుకున్నారు.

తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఈపీడీసీఎల్‌కు ఈ తుఫాన్ వల్ల స్వల్ప నష్టమే జరిగింది. రెండు గ్రామాలకు విద్యుత్ నిలిచిపోగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. 33 కేవీ సబ్ స్టేషన్లు 12 పాడైపోగా వాటికి సంబంధించిన రెండు స్తంభాలు దెబ్బతిన్నాయి. 11కేవీ సబ్ స్టేషన్లు 26 ప్రభావితం కాగా రెండు స్తంభాలు పడిపోయాయి. వాటిని సరిచేశారు.

ముందస్తు ఏర్పాట్లతో తగ్గిన నష్టం

తుఫాన్ మొంథా తీవ్ర ప్రభావం చూపుతుందని నివేదికలు, హెచ్చరికలు రావడంతో ప్రభుత్వం వాటిని ఎదుర్కొనడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. దాంతో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి, మండలాలకు ప్రత్యేక అధికారుల నియమించి, వరద నష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలకు వరుసగా మూడు రోజులు సెలవు ప్రకటించారు. గురువారం కూడా సెలవు ఇచ్చారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యేలు, మేయర్ అంతా అందుబాటులో ఉండి వారి వారి ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టారు. దాంతో పెద్దగా నష్టాలు ఏమీ జరగలేదు. ముందస్తు అప్రమత్తతతో అధిక నష్టం లేకుండా ఈ విపత్తును అధిగమించారు.

ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ

- 164.7 అడుగులకు నీటిమట్టం
- పూర్తి సామర్థ్యం 170 అడుగులు

ఆరిలోవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు ముడసర్లోవ జలాశయంలో జలకళ సంతరించుకున్నది.బుధవారం సాయంత్రానికి నీటిమట్టం సుమారు 164.5 అడుగులకు చేరుకుందని సంబంధిత అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 163..6 అడుగుల నీటిమట్టం ఉండేది. ఒక రోజులో అడుగు మేర నీటి మట్టం పెరిగిందని అధికారులు తెలిపారు. కాగా ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 170అడుగులుగా అధికారులువెల్లడించారు.

అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు.

కారుతో హోంగార్డును ఢీకొని పరారీ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మహిళను గుర్తుతెలియని వ్యక్తి కారుతో ఢీకొని పరారైన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 26న ఉదయం పదకొండున్నర సమయంలో హోంగార్డు శుభమని ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలో స్టేషన్‌కు నడుచుకుంటూ వెళుతుండగా, గుర్తు తెలియని కారు రివర్స్ చేసుకుంటూ గట్టిగా వేగంగా వచ్చి ఢీకొంది. అనంతరం ఆ కారు నడుపుతున్న వ్యక్తి వాహనంతో పరారయ్యాడు. ఈ ప్రమాదంలో హోంగార్డు శుభమణి ఎడమ కాలి ఎముక విరిగింది. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. బాధిదురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద ఘటనపై దర్యాప్తు చేయండి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తన సోదరుడు మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, అతడి మృతి ఘటనపై ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతూనేపాల్‌కు చెందిన సీతాషా ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఏఎస్ఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌లోని ఝూపా జిల్లాకు చెందిన రాంబలి షా(42) ఎనిమిది నెలల క్రితం విశాఖపట్నం వచ్చి శివా బిల్డ్ టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కార్మికుడిగా చేరాడు. ఇసుకతోట వద్ద ఈ నెల 25 రాత్రి ట్రాక్టర్‌కు అమర్చిన బ్రూమర్‌పై సేఫ్టీ లైట్ మ్యాన్‌గా విధుల్లో ఉండగా బ్రూమర్ ఇనుప కవర్ రాంబలి షా తొడ భాగానికి తగిలింది. తీవ్ర రక్తస్రావం కాగా, అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని నేపాల్ నుంచి వచ్చిన రాంబలి షా సోదరి ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రసాద్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 36, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 32, కంద 48, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

మొంథా ప్రభావం

- విరిగిన కొండ చరియలు
- కొండవాలు ప్రాంతంలో కూలిన మెట్ల మార్గం



కొండచరియలు విరిగిన ప్రాంతం



ఇళ్ల ముందు పడుతున్న బండరాళ్లు

వెంకోజీపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావం 15వ వార్డులోని కొండవాలు ప్రాంతంపై గట్టిగా చూపించింది. సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్, దుర్గానగర్‌లలో కొండచరియలు జారి ఇండ్లపైకి బండరాళ్లు చొచ్చుకొచ్చాయి. కొండపైన వచ్చిన వరద తాకిడికి మెట్ల మార్గం కూడా అక్కడక్కడ కొట్టుకుపోయింది. దీంతో కొండ ప్రాంత నివాసులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బిక్కుబిక్కుమంటూ జీవనాన్ని సాగిస్తున్న వారంతా తుపాను శాంతించడంతో కాస్త ఉపశమనాన్ని పొందారు.

మరమ్మతులకు నిధులు అందించండి
- మేయర్‌కు కార్పొరేటర్ వినతి

మొంథా తుఫాను కారణంగా చిందరవందరైన 15వ వార్డులోని భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రాంతమైన దుర్గానగర్, లక్ష్మీనరసింహనగర్ గ్రామాల్లో మరమ్మతులు, పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావును 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కోరారు. మేయర్‌ను బుధవారం ఆమె జీవీఎంసీలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. తుపాను కారణంగా కొండ చరియలు జారి పడడంతో ఇళ్లలోకి బండరాళ్లు, ఇళ్ల ముందు మట్టి పేరుకుపోయి ప్రమాదకరంగా తయారైందని మేయర్‌కు వివరించారు. మొంథా తుపాను ప్రభావం అధికంగా ఈ వార్డుపై పడిందన్నారు. ఈ ప్రాంతంలో రక్షణ గోడలు, నూతన డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. మేయర్‌ను కలిసిన వారిలో ఆమెతో పాటు జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు అప్పారి గిరిబాబు, నరాల సత్తిబాబు ఉన్నారు.



మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, పాల్గొన్న జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుడు గిరిబాబు, సత్తిబాబు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

వెంకోజీపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వలన ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి సీఎం చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌లు యుద్ధప్రాతిపదికన అన్ని ప్రాంతాల వారికి నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకోవడం మానవత్వ విలువలను చాటుతోందని ఏపీనిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బురదమయంగా రైతు బజార్

- వర్షాలకు ఆవరణలో నిలిచిన నీరు
- రహదారి సౌకర్యం లేక ఇక్కట్లు
- వసతులు కావాలంటున్న కొనుగోలుదారులు



వర్షాలకు ఆరిలోవ రైతు బజార్ ఆవరణలో నిలిచిన నీరు

ఆరిలోవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రారంభించిన స్థానిక రైతుబజార్‌కు సౌకర్యాల కొరత వేధిస్తోంది. బజార్‌కు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బజార్ బురదమయంగా తయారైంది. కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షం వచ్చినపుడు బజార్ ప్రాంగణంలో వరద నీరు నిల్వ లేకుండా చేయాల్సి ఉంది. చిన్న వర్షం పడినా ఇప్పుడు నీరు ఎటూ వెళ్లని పరిస్థితి నెలకొని ఉంది. అలాగే సరైన పార్కింగ్ సదుపాయాల్ని కల్పించాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

కాగా, ఈ రైతుబజార్‌కు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎస్టేట్ అధికారి నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతానికి ప్రతి రోజూ 22 టన్నులు కూరగాయల అమ్ముడవుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం రోజుకు 14 నుంచి 16 క్వింటాళ్లవరకూ అమ్మకాలు జరుగుతున్నట్టు చెప్పారు. ఇక్కడ 35 దుకాణ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని, బజార్‌లో మొత్తం 43 కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మరికొన్ని కౌంటర్లకు ఇంకా రైతులు రావాల్సి ఉందని ఎస్టేట్ అధికారి తెలిపారు.

ఈ వర్షాలకు బజార్ ప్రాంగణమంగా బురదమయంగా మారిడంతో కొనుగోలు ఇబ్బంది పడుతున్నారు. రహదారి ఏర్పాటుతో పాటు బజార్‌ను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. ఇక్కడ రైతు బజార్ ఉన్నట్టే తెలియడం లేదని అంటున్నారు. కూడలిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే బజార్‌కు మరింత ఆదరణ పెరుగుతుందని అభిప్రాయ పడుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలను అందజేస్తున్న టీడీపీ యువ నేత ప్రతాపరుద్ర, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన మొత్తాలకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, యువనేత ప్రతాపరుద్ర బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో పాత డెయిరీఫారం వద్ద గల శ్రీహరినగర్‌కు చెందిన అందుకూరి సత్యవతికి రూ.55 వేలు, ఇందిరానగర్‌కు చెందిన రూ. 1,55,308లు, ఆదర్శనగర్‌కు చెందిన పోలిశెట్టి ప్రభావతికి రూ.75,000, బీఎన్ఆర్ నగర్‌కు చెందిన సూరాడ నూకాలమ్మకు రూ.79,258లు చొప్పున ఆర్థిక సహాయం మంజూరైంది. కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పుష్పయాగానికి విశాఖ నుంచి పుష్పాలు



టీటీడి కల్యాణమండపంలో పుష్ప సంకల్పం చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీవారి పుష్పయాగానికి విశాఖ నుంచి కలువ, తామర, సంపంగి, మల్లె వంటి పువ్వులను పంపించారు. శ్రీవారి సేవకుడు హిమాంశు ప్రసాద్ తన సొంత నిధులతో వీటిని సేకరించి, ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణమండపంలో బుధవారం శ్రీవారి చిత్రపటం వద్ద ఉంచి సంకల్పం చేశారు. కార్యక్రమంలో టీటీడీ స్థానిక సలహా మండలి ఛైర్మన్ సీవీ పట్టాభిరామ్ పూజల్లో పాల్గొన్నారు. మూడు వేల కలువ పూలు, రెండు వేల తామరపువ్వులు పంపించాల్సిందిగా కోరిన టీటీడీ గార్డెన్ పర్యవేక్షణాధికారి లేఖ మేరకు వీటిని పంపించారు.

పార్కులో చెట్ల కొమ్మలు తొలగింపు



పార్కులో నేల కూలిన చెట్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పెదవాల్తేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షల ప్రభావంతో వీచిన పెనుగాలులకు మంగళవారం లాసన్స్ బే కాలనీ పార్కులోని అనేక చెట్లు నేల కూలాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు, మానుల తరలింపునకు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్.. శానిటరీ ఇన్స్పెక్టర్ వై.శ్రీనివాసరావు, ఇతర సిబ్బందితో బుధవారం వచ్చి పార్కులోని నేల కూలిన అనేక చెట్లు, మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

జీవీఎంసీ అధికారులు, సిబ్బందికి లాసన్స్ బే కాలనీ బీచ్ పార్కు వాకర్స్ అసోసియేషన్‌అధ్యక్షుడు ఆర్.దశరథ రామయ్య, కార్యదర్శి రాజారావు, మంగరాజు, ఇతర సభ్యులు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా లాసన్స్ బే బీచ్ పార్క్‌పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడంలో జీవీఎంసీ అధికారులు చూపిన చొరవకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముంపులో నాగమయ్యపాలెం

- తుఫాన్ ధాటికి గ్రామాన్ని చుట్టుముట్టిన వరద నీరు
- పడవలో వెళ్లి బాధితుల్ని పరామర్శించిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- తుఫాన్ షెల్టర్‌లో తలదాచుకున్న 32 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ



పడవలో ప్రయాణిస్తూ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంటా, తదితరులు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని నాగమయ్యపాలెం గ్రామాన్ని గోస్తనీ నది, సముద్ర నీరు కలిసి చుట్టుముట్టాయి. ఈ గ్రామం నది, సముద్రానికి సమీపంలో ఉంది. ఈ నేపథ్యంలో తాటిపూడి రిజర్వాయర్ నుంచి భారీగా నీరు విడుదల చేయడంతో గోస్తనీ నది ఉప్పొంగింది. ఆ నీటికి సముద్రపు నీరు తోడవడంతో గ్రామమంతా నాలుగు అడుగుల ఎత్తున నీరు చేరింది. గ్రామంలో ఉన్న ఇళ్లు ప్రస్తుతం నీటిలో నానుతున్నాయి. అయితే తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రెండు రోజుల కిందటే గ్రామంలోని అధిక శాతం మంది ఇళ్లకు తాళాలు వేసుకుని, విశాఖ తదితర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే 32 కుటుంబాలవారు గ్రామంలోకి నీరు చేరుతుండగా, అక్కడకు సమీపంలోని తుఫాన్ షెల్టర్‌లో తలదాచుకున్నారు.

పడవలో వెళ్లి పరామర్శించిన గంటా

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం గ్రామానికి చేరుకున్నారు. సరిహద్దుకు వెళ్లేసరికి గ్రామమంతా నీటితో నిండి ఉండడాన్ని గమనించారు. గ్రామంలోకి వెళ్లడం ప్రమాదమని అధికారులు హెచ్చరించడంతో స్థానిక మత్స్యకారులు ఏర్పాటుచేసిన పడవలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సహకార సొసైటీ అధ్యక్షుడు గుడ్డాల ఎల్లయ్య, తదితరులతో కలిసి వెళ్లి నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. గ్రామాన్ని ముంచేసిన నీరు తగ్గేందుకు కనీసం వారం రోజులు పడుతుందని ఎమ్మెల్యేకు గ్రామస్థులు వివరించారు. ఇళ్లలో సామగ్రి, దుస్తులు నాని పోయి పాడయ్యాయని వాపోయారు. కాగాఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నిత్యావసర సరకుల పంపిణీ

అనంతరం తుఫాన్ రక్షిత భవనంలోకి వెళ్లి అక్కడ తలదాచుకున్న గ్రామస్థులను గంటా పరామర్శించారు. అక్కడ వారికి భోజన ఏర్పాట్లు లేకపోవడంతో వెంటనే స్పందించి 32 కుటుంబాల వారికి అవసరమైన నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. గతంలో అనేకసార్లు ఇదే సమస్యను ఎదుర్కొన్నా పరామర్శించిన వారు, సాయం చేసిన వారు కనిపించలేదని, ఎమ్మెల్యే గంటా పడవపై వచ్చి యోగక్షేమాలు తెలుసుకోవడం, ఆదుకోవడాన్ని మరచిపోలేమని గ్రామస్థులు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో తక్షణ చర్యలు తీసుకున్న అధికారులు



పనులు పర్యవేక్షిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావం, హౌసింగ్ స్థలంలో బహుళ అంతస్థుల దుకాణం నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు గోతిలో పడిపోయిన సంగతి విధితమే. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరతో విద్యుత్ శాఖఅధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే బుధవారం హుటాహుటిన నూతన ట్రాన్స్‌ఫార్మర్, కొత్త విద్యుత్ లైను ఏర్పాటు చేసి స్థానికులకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా పునరుద్ధరణ చేపట్టారు. స్థానికుల సమస్యపై వెనువెంటనే స్పందించి తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఆదేశించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు ముగడ వాసు, 15వ వార్డు అధ్యక్షులు మళ్ల రవికుమార్, విద్యుత్ శాఖాధికారులకు శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ, ఈఈ జ్యోతి, హెచ్‌బీ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ కుసుమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పనులపై దృష్టి సారించాలి

- మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి



అధికారులతో చర్చిస్తున్న జ్ఞానవేణి

పద్మనాభం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాను అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలపై అన్నిశాఖల అధికారులు దృష్టిసారించాలని మండల ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి ఆదేశించారు. బుధవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, తుఫానుకు దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడం, దెబ్బతిన్న పంటల నష్టపరిహారం అంచనా వేయడం, కూలిన ఇళ్ల వివరాలు సేకరించడం వంటి పనులు చేపట్టాలన్నారు. అలాగే తాగునీటిని క్లోరినేషన్ చేయించి ప్రజలకు అందించాలన్నారు.

కొండవాలు ప్రాంతానికి ప్రత్యామ్నాయ రహదారి

- ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం



ఇసుక బస్తాలు అమర్చి ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రహదారి

ఆరిలోవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల మొంథా తుపాను దెబ్బకు కొండవాలు ప్రాంతంలో మంగళవారం రోడ్డు కూలిపోవడంతో, పరిశీలించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం రంగంలోకి దిగి ఇసుక బస్తాలు అమర్చి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. ఇసుక బస్తాలకు సపోర్టుగా సరుగుడు కర్రలను ఉంచారు.

త్వరలోనే పక్కా రోడ్డు వేస్తామని, అంతవరకూ ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే యూజీడీ పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై కొండవాలు ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యే వెలగపూడికి కృతజ్ఞతలు తెలిపారు.

'మొకర' సేవలు అభినందనీయం

భీమునిపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మొకర నారాయణరావు తెలుగుదేశం పార్టీకి, పట్టణ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బుధవారం నారాయణరావు జయంతి సందర్భంగా కాలేజీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా పని చేసిన నారా యణరావు ప్రజలకు అనేక సేవలు చేశారన్నారు. నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూడా మొకర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో నాయకులు మారోజు సంజీవకుమార్, చురకల రమణ, కొక్కిరి అప్పన్న, కృష్ణారావు, మొకర నీలకంఠం, కె. ముత్యాలరావు, కనకల సన్యాసినాయుడు, గాడు ఆనంద్, సంకురుబోతు జోగారావు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ఆహారం పంపిణీ

ఎంవీపీ కాలనీ/ వెంకోజీపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోనివాసవానిపాలెం, అప్పుఘర్,పెదజాలారిపేటకు చెందిన తుపాను బాధితులకు స్థానిక సామాజిక భవనంలో తాత్కాలికంగా పునరావాసం ఏర్పాటు చేసి, ఆహారం పంపిణీ చేశారు. కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలారావు ఆధ్వర్యంలో వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచారు. పలు ప్రాంతాల్లోని వీధుల్లో పడిన చెట్ల కొమ్మలను జీవీఎంసీ ఏఈ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. అలాగే 15వ వార్డులోని సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో కొండ చరియలు పలు ఇండ్లపై జారి పడ్డాయి. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సింహాద్రిపురం, దుర్గానగర్‌లోని సామాజిక భవనాల్లో 5 కుటుంబాలకు చెందిన సుమారు 20 మంది ఈ పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి ఇటీవల ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన బుగత సత్యనారాయణ బుధవారం ఆహారాన్ని అందజేశారు.

దుర్గాభవానీ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

ఆనందపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం పంచాయతీలోని ఏపీబీసీ కాలనీలో దుర్గాభవానీ ఆలయానికి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. ఎమ్మెల్యే గంటా ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా కొట్యాడ లక్ష్మణమూర్తి, కార్యదర్శులుగా మజ్జి అప్పలరాజు, లంకలపల్లి అప్పలరాజు, ఇతర సభ్యులను ప్రకటించారు. అలాగే నారాయణేశ్వరస్వామి పార్వతీ అమ్మవారి ఆలయానికి కూడా నూతన కమిటీని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రకటించారు.

రాత్రంతా పరిస్థితిని సమీక్షించిన సీపీ శంఖబ్రత బాగ్చి



మంగళవారం అర్ధరాత్రి బీచ్‌రోడ్డులో పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బీచ్‌లో పరిస్థితిని సీపీ శంఖబ్రత బాగ్చి బుధవారం తెల్లవారుజాము వరకు స్వయంగా పర్యవేక్షించారు. తుఫాన్ తీరందాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సీపీ నగరంలో ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. తీరంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మంగళవారం అర్ధరాత్రి ఫిషింగ్‌హార్బర్ నుంచి పెదజాలారిపేట, అప్పూఘర్ వరకు తిరిగారు. బీచ్‌రోడ్డులో సందర్శకులు, వాహనచోదకులను వెనక్కి పంపించేశారు. తీరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి, ప్రజలు రాకుండా చూడాలని ఆదేశించారు. గోస్తనీనది పరీవాహకప్రాంతాలైన పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో మంగళ, బుధవారాల్లో సీపీ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

సీసీ కెమెరాలకు అడ్డంగా చెట్లకొమ్మలు


సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు కైలాసపురం సూరిబాబునగర్ కూడలి రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చెట్టు కొమ్మలు అడ్డంగా ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ఏమి జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా రాత్రి సమయంలో దొంగతనాలు, ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లలో పెట్రోల్ చోరీ చేయడం, అసాంఘిక కార్యక్రమాలు, మందుబాబుల ఆగడాలకు అంతులేకుండా పోతోందని చెబుతున్నారు. అదే స్తంభానికి ఉన్న వీధి దీపాలు తక్కువ కాంతి ఇస్తున్నాయని, వీటిని సరిచేసి సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జనచైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షీరిన్ రహమాన్ అన్నారు. వన్‌టౌన్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. రొమ్ములో వస్తున్న మార్పులు, కణతలు ఏర్పడినా, రక్తస్రావం జరిగినా వైద్యుల వద్దకు వెళ్లాలన్నారు. మొదటి రెండు దశలలో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

మర్రిపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్యాంకు సర్కిల్ హెడ్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు ఉన్నతమైన సేవలు, సామాజిక కార్యక్రమాలు చేపట్టడంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఖాతాదారులు సేవలను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. అనంతరం పెద్దసంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మనోజ్ సేథ్, ప్రదీప్‌జాంబాలా, ఉద్యోగులు పాల్గొన్నారు.

కారుతో హోంగార్డును ఢీకొని పరారీ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మహిళను గుర్తుతెలియని వ్యక్తి కారుతో ఢీకొని పరారైన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 26న ఉదయం పదకొండున్నర సమయంలో హోంగార్డు శుభమని ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలో స్టేషన్‌కు నడుచుకుంటూ వెళుతుండగా, గుర్తు తెలియని కారు రివర్స్ చేసుకుంటూ గట్టిగా వేగంగా వచ్చి ఢీకొంది. అనంతరం ఆ కారు నడుపుతున్న వ్యక్తి వాహనంతో పరారయ్యాడు. ఈ ప్రమాదంలో హోంగార్డు శుభమణి ఎడమ కాలి ఎముక విరిగింది. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. బాధిదురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2 నుంచి బాలల దినోత్సవ పోటీలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, వైజాగ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించనున్నట్టు వీసీసీ ఫౌండర్ కె.రమాప్రభ తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బాలల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 135 క్లబ్బులలో నవంబరు 2 నుంచి 14 వరకు బాలల దినోత్సవ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ దీప జలోక, వైస్ ప్రెసిడెంట్ సునీత, కన్వీనర్ కె.సుశీల, మణి, సరోజ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు భరోసా


ఓ ఇంటి వద్ద జాగ్రత్తలు చెబుతున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు


గాంధీనగర్‌లో పేదలకు భోజనాలు అందజేస్తున్న ఈతలపాక సుజాత


పూరిల్లు కూలిపోయిన కుటుంబాన్ని కలిసిన జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా బుధవారం విశాఖ టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు 32, 34 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను సమీపంలో ఉన్న పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, వైద్య సదుపాయాలు కల్పించారు. పునరావాస కేంద్రంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ ఎలాంటి అవసరం వచ్చినా పోలీసులను సంప్రదించాలని సీఐ ఎర్రంనాయుడు కోరారు. ఆయన వెంట జనసేన నాయకులు తెలుగు అర్జున్, రాగతి గణేష్ ఉన్నారు.

అభాగ్యులకు భోజన సదుపాయం

కంచరపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి కంచరపాలెం మెట్టు సమీపంలో గల గాంధీనగర్ మురికివాడలో గల పేదలు, అభాగ్యులకు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత సహాయక చర్యలు అందించారు. బుధవారం గాంధీనగర్‌లో పర్యటించి బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం తన సొంత నిధులతో సమకూర్చారు. గాంధీ నగర్‌ను ఆనుకుని రైల్వే స్థలంలో దశాబ్దాలుగా వంద కుటుంబాలకు చెందిన నిరుపేదలు పాకలు, షెడ్‌లు వేసుకుని నివసిస్తున్నారు. తుఫాన్ కారణంగా వీరికి పనిలేక ఆకలితో ఉండడంతో భోజన సదుపాయం కల్పించినట్లు సుజాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరుబాబు, ఈశ్వరరావు, అప్పారావు, రమా, రాజీ నాయక్, కె.రమణ పాల్గొన్నారు.

కూలిపోయిన పేదల పూరిల్లు

అల్లిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం 34వవార్డు పరిధిలోని అచ్చియ్యమ్మపేటలో రెండు రోజులు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు బుధవారం ఉదయం ఒక పూరిల్లు కూలిపోయింది. తమ ఆసరా కూలిపోవడంతో ఆ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు అక్కడకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు.

పక్షవాతంపై అవగాహన ఉంటే ప్రాణరక్షణ

- సమస్య గుర్తించిన మూడు గంటల్లో ఇంజక్షన్ ఇస్తే మేలు
- కేజీహెచ్‌లో ఉచిత వైద్య సదుపాయం
- ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి


డాక్టర్ గోపిని సన్మానిస్తున్న ప్రముఖులు

మహారాణిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) పై అవగాహన పెంచుకొని సరైన సమయంలో చికిత్స అందిస్తే రోగి పూర్తిగా కోలుకుంటారని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అన్నారు. బుధవారం వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కేజీహెచ్‌లో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ రోగి పక్షవాతానికి గురైనట్లు గుర్తించిన మూడు గంటల్లోగా కేజీహెచ్‌కు తీసుకు వస్తే సుమారు రూ.60 వేల ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తామని, తద్వారా రోగి పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం సాగించవచ్చని తెలిపారు. దీనిపై ప్రజల్లో అవగాహన ఉండాలని తెలిపారు. ఈ ఏడాది సుమారు 80 మంది నిసమయానికి ఆసుపత్రికి తీసుకు రావటంతో వైద్యసేవలు అందించగలిగామని, రోగులు పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపిని అభినందిస్తూ శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, పలువురు న్యూరాలజిస్టులు, విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

దృష్టిలోపం ఉన్న సంగీత కళాకారులకు విరాళం


చెక్కు అందచేస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

సీతంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దృష్టి లోపం ఉన్న సంగీత కళాకారులకు సేవా దృక్పథంతో వండర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు రూ.4,20,110 విరాళం సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కును గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ద్వారా బుధవారం కళాకారులకు అందజేశారు. సింహాచలం ప్రాంతానికి చెందిన వై.అమ్మినాయుడు నాయకత్వంలో 13 మంది దృష్టి లోపం గల సంగీత కళాకారులకు ఈ చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్కూల్ చైర్మన్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న సంగీతకారులతో పాఠశాలలో కార్యక్రమం చేపట్టామని, వారి పరిస్థితిని చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదారత చూపి విరాళాలు సేకరించి అందచేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం.వాణిశ్రీ, ఆర్.రమణ, ప్రిన్సిపాల్ సంగీతారాణి, చట్టి గోవి, చట్టి రమణ, ఉపాధ్యాయులు భార్గవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూములకు రక్షణ


మాధవధారలో భూముల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ

మాధవధార, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం భూములకు రక్షణగా గత ప్రభుత్వ హయాంలో ఆరంభించిన ప్రహరీ గోడ నిర్మాణంలో భాగంగా నేడు మాధవధారలో పనులు జరుగుతున్నాయి. దేవస్థానం గుర్తించిన భూముల చుట్టూ సిమ్మెంటు కాంక్రీట్‌తో ప్రహరీ కడుతున్నారు. ఇంజనీరింగ్ ఇంచార్జి ఈఈ వి.రమణ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. అక్రమార్కులకు అడ్డుకట్ట వేస్తూ పనులు వేగంగా చేస్తున్నారు. దేవస్థానం పర్యవేక్షణలో వీఎంఆర్డీఏ నిధులతో పనులు చేపడుతున్నారు. మాధవధార కొండపైన మాధవస్వామి ఆలయం నుంచి దిగువ జీవీఎంసీ వాటర్ ట్యాంక్ వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. కొండకు చేరే దారిలో ఓ వైపు స్థలాలకు హద్దు నిర్ణయించి ఈ పనులు నిర్వహిస్తున్నారు.

పుష్పయాగానికి విశాఖ నుంచి పుష్పాలు


టీటీడీ కల్యాణమండపంలో పుష్ప సంకల్పం చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీవారి పుష్పయాగానికి విశాఖ నుంచి కలువ, తామర, సంపంగి, మల్లె వంటి పువ్వులను పంపించారు. శ్రీవారి సేవకుడు హిమాంశు ప్రసాద్ తన సొంత నిధులతో వీటిని సేకరించి, ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణమండపంలో బుధవారం శ్రీవారి చిత్రపటం వద్ద ఉంచి సంకల్పం చేశారు. కార్యక్రమంలో టీటీడీ స్థానిక సలహా మండలి చైర్మన్ సీవీ పట్టాభిరామ్ పూజల్లో పాల్గొన్నారు. మూడు వేల కలువ పూలు, రెండు వేల తామరపువ్వులు పంపించాల్సిందిగా కోరిన టీటీడీ గార్డెన్ పర్యవేక్షణాధికారి లేఖ మేరకు వీటిని పంపించారు.

భద్రతా చర్యలపై రైల్వే ఉన్నతాధికారి ఆడిట్


విశాఖలో యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఉత్తమప్రకాష్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ ఉత్తమప్రకాష్ నేతృత్వంలో గువహటి, మాలిగావ్ నుంచి ప్రత్యేక బృందం బుధవారం వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ-బొబ్బిలి సెక్షన్‌లో పర్యటించి అంతర్ జోన్‌ల భద్రత ఆడిట్ నిర్వహించింది. భద్రతా నిబంధనలు పాటించడం, సురక్షిత రైలు కార్యకలాపాల నిర్వహణ, రైల్వే బోర్డు మార్గదర్శకాలను అమలుచేస్తున్న విధానాలపై ఆడిట్ నిర్వహించారు. దీనిలో భాగంగా విశాఖలోని యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్యూప్‌మెంట్ వ్యాన్, యాక్సిడెంట్ వ్యాన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, కొత్త కోచింగ్ కాంప్లెక్స్, రన్నింగ్ రూమ్, రూట్ రిలే క్యాబిన్‌లను పరిశీలించారు. కొత్తవలస స్టేషన్ యార్డు పాయింట్లు, క్రాసింగ్, అలమండ-కోరుకొండ మధ్య మేజర్ బ్రిడ్జి, కోమటిపల్లి-డొంకినవలస మధ్య ఇంజనీరింగ్ ఆపరేటెడ్ లెవల్ క్రాసింగ్ గేట్ నిర్వహణను పరిశీలించారు. బొబ్బిలి స్టేషన్‌లోని రిలే రూమ్, కోమటిపల్లి యార్డు, ట్రాక్షన్ సబ్‌స్టేషన్, లెవెల్ క్రాసింగ్ గేట్, కోచి క్రూ లాబీని పరిశీలించారు. అనంతరం ఆడిట్ బృందంతో డీఆర్ఎం సమావేశమయ్యారు.

సదుపాయాలపై డీఆర్ఎం పరిశీలన


అధికారులతో కలిసి విద్యుత్ లోకోషెడ్‌ను సందర్శించిన డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోకోషెడ్, పాత స్టేషన్ టెర్మినల్‌లో డీఆర్ఎం లలిత్‌బొహ్రా బుధవారం పర్యటించి మౌలిక సదుపాయాలు, రవాణా పెంపు సామర్థ్యం, ఇతర సౌకర్యాల మెరుగుదలను పరిశీలించారు. పెరుగుతున్న రవాణా డిమాండ్‌కు తగ్గట్టుగా సామర్థ్యాలను మెరుగుపరచడం, అవసరమైన సదుపాయాల కల్పనపై అధికారులతో సమీక్షించారు. ఆశించిన ఫలితాలు సాధించేందుకు రవాణా సౌకర్యాలను విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని, అందుకు అవసరమైన అదనపు లైన్ల నిర్మాణం, ప్రస్తుత లైన్ల నిర్వహణ మెరుగుపరిచేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్, సీనియర్ డీఈఈ (సౌత్) నవీన్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ముంపులో నాగమయ్యపాలెం

- తుఫాన్ ధాటికి గ్రామాన్ని చుట్టుముట్టిన వరద నీరు
- పడవలో వెళ్లి బాధితుల్ని పరామర్శించిన భీమిలి ఎమ్మెల్యే గంటా
- తుఫాన్ షెల్టర్‌లో తలదాచుకున్న 32 కుటుంబాలకు నిత్యావసర సరకులు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని నాగమయ్యపాలెం గ్రామాన్ని గోస్తనీ నది, సముద్ర నీరు కలిసి చుట్టుముట్టాయి. ఈ గ్రామం నది, సముద్రానికి సమీపంలో ఉంది. ఈ నేపథ్యంలో తాటిపూడి రిజర్వాయర్ నుంచి భారీగా నీరు విడుదల చేయడంతో గోస్తనీ నది ఉప్పొంగింది. ఆ నీటికి సముద్రపు నీరు తోడవడంతో గ్రామమంతా నాలుగు అడుగుల ఎత్తున నీరు చేరింది. గ్రామంలో ఉన్న ఇళ్లు ప్రస్తుతం నీటిలో నానుతున్నాయి. అయితే తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రెండు రోజుల కిందటే గ్రామంలోని అధిక శాతం మంది ఇళ్లకు తాళాలు వేసుకుని, విశాఖ తదితర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే 32 కుటుంబాలవారు గ్రామంలోకి నీరు చేరుతుండగా, అక్కడకు సమీపంలోని తుఫాన్ షెల్టర్‌లో తలదాచుకున్నారు.

పడవలో వెళ్లి..


పడవలో ప్రయాణిస్తూ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం గ్రామానికి చేరుకున్నారు. సరిహద్దుకు వెళ్లేసరికి గ్రామమంతా నీటితో నిండి ఉండడాన్ని గమనించారు. గ్రామంలోకి వెళ్లడం ప్రమాదమని అధికారులు హెచ్చరించడంతో స్థానిక మత్స్యకారులు ఏర్పాటుచేసిన పడవలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సహకార సొసైటీ అధ్యక్షుడు గుడ్డాల ఎల్లయ్య, తదితరులతో కలిసి వెళ్లి నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. గ్రామాన్ని ముంచేసిన నీరు తగ్గేందుకు కనీసం వారం రోజులు పడుతుందని ఎమ్మెల్యేకు గ్రామస్థులు వివరించారు. ఇళ్లలో సామగ్రి, దుస్తులు నానిపోయి పాడయ్యాయని వాపోయారు. కాగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నిత్యావసర సరకుల పంపిణీ

అనంతరం తుఫాన్ రక్షిత భవనంలోకి వెళ్లి అక్కడ తలదాచుకున్న గ్రామస్థులను గంటా పరామర్శించారు. అక్కడ వారికి భోజన ఏర్పాట్లు లేకపోవడంతో వెంటనే స్పందించి 32 కుటుంబాల వారికి అవసరమైన నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. గతంలో అనేకసార్లు ఇదే సమస్యను ఎదుర్కొన్నా పరామర్శించిన వారు, సాయం చేసిన వారు కనిపించలేదని, ఎమ్మెల్యే గంటా పడవపై వచ్చి యోగక్షేమాలు తెలుసుకోవడం, ఆదుకోవడాన్ని మరచిపోలేమని గ్రామస్థులు తెలిపారు.

రాత్రంతా పరిస్థితిని సమీక్షించిన సీపీ


మంగళవారం అర్ధరాత్రి బీచ్‌రోడ్డులో పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బీచ్‌లో పరిస్థితిని సీపీ శంఖబ్రతబాగ్చి బుధవారం తెల్లవారుజాము వరకు స్వయంగా పర్యవేక్షించారు. తుఫాన్ తీరందాటే సమయంలో భారీవర్షాలు, ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సీపీ నగరంలో ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. తీరంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మంగళవారం అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ నుంచి పెదజాలారిపేట, అప్పూఘర్ వరకు తిరిగారు. బీచ్‌రోడ్డులో సందర్శకులు, వాహనచోదకులను వెనక్కి పంపించేశారు. తీరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి, ప్రజలు రాకుండా చూడాలని ఆదేశించారు. గోస్తనీనది పరీవాహకప్రాంతాలైన పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో మంగళ, బుధవారాల్లో సీపీ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

తప్పిన మొంథా ముప్పు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో 16 శిబిరాలను మాత్రమే ఉపయోగించారు. వాటిలోకి 1,516 మందిని తరలించారు. జిల్లాలో 22 ఇళ్లకు నష్టం వాటిల్లింది. అలాగే 21 గ్రామాల్లో 10.7.7 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. దీనివల్ల 383 మంది రైతులు నష్టపోయారు. సుమారు 160 చెట్లు కూలిపోగా, వాటన్నింటినీ పక్కకు తొలగించారు. పది విద్యుత్ స్తంభాలు పడిపోగా వాటిని కూడా పునరుద్ధరించారు. జిల్లాలో 27 ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోగా, మళ్లించే చర్యలు తీసుకున్నారు.

తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఈపీడీసీఎల్‌కు ఈ తుఫాన్ వల్ల స్వల్ప నష్టమే జరిగింది. రెండు గ్రామాలకు విద్యుత్ నిలిచిపోగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. 33 కేవీ సబ్‌స్టేషన్లు 12 పాడైపోగా వాటికి సంబంధించిన రెండు స్తంభాలు దెబ్బతిన్నాయి. 11కేవీ సబ్ స్టేషన్లు 26 ప్రభావితంగా కాగా రెండు స్తంభాలు పడిపోయాయి. వాటిని సరిచేశారు.

ముందస్తు ఏర్పాట్లతో తగ్గిన నష్టం

తుఫాన్ మొంథా తీవ్ర ప్రభావం చూపుతుందని నివేదికలు, హెచ్చరికలు రావడంతో ప్రభుత్వం వాటిని ఎదుర్కొనడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. దాంతో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి, మండలాలకు ప్రత్యేక అధికారుల నియమించి, వరద నష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలకు వరుసగా మూడు రోజులు సెలవు ప్రకటించారు. గురువారం కూడా సెలవు ఇచ్చారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యేలు, మేయర్ అంతా అందుబాటులో ఉండి వారి వారి ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టారు. దాంతో పెద్దగా నష్టాలు ఏమీ జరగలేదు. ముందస్తు అప్రమత్తతతో అధిక నష్టం లేకుండా ఈ విపత్తును అధిగమించారు.

కొండవాలు..గుండె గుబులు!


కంచరపాలెం ఏరియాలో కొండవాలు ప్రాంతంలో ఇళ్లు

కంచరపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధి కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు వర్షం పడితే ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఉండాల్సి వస్తోంది. కొండ శిఖరాలపై ఎటువంటి ఆధారం లేకుండా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తుండడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, తుఫాన్లు సంభవించే సమయాల్లో వీరికి రాత్రి సమయాల్లో కంటికి కునుకే ఉండదు. ఏ రాయి ఎటునుంచి వచ్చి పడుతుందో..తమ ఇళ్ల కింద ఉన్న కొండచరియలు ఎప్పుడు జారిపోతాయో అన్న ఆందోళనతో ఉంటారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారికి కనీసం రక్షణ గోడలు ఉండవు. పాలకులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం తమ పాలిట శాపంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు. 48వ వార్డులో ఇందిరానగర్-1 నుంచి 5 గ్రామాలు, జైభారత్ నగర్, శ్రీనివాసనగర్ పంచగ్రామాలు, అరుంధతీ నగర్, పెద కొత్తూరు, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఈసమస్యపై రాజకీయ నాయకులు, అధికారులు ఎప్పుడూ దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చొరవచూపి కనీసం రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకుంటే బండరాళ్లు పడే ప్రమాదం ఉండదని చెబుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కష్టకాలంలో కానరాని నాయకులు!

- ప్రజల సమస్యలకు పలికే నాథుడే కరువు
- 31వ వార్డులో తాజా పరిస్థితి

డాబాగార్డెన్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని ప్రజాప్రతినిధులు అసలు.. ఉన్నారా...లేరా? అన్న సందేహం ప్రజలకు కలుగుతోంది. మొంథా తుఫాన్ ప్రభావంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా నాయకులు కానరావడం లేదు. ఎమ్మెల్యే స్థాయి నాయకుడో..లేదా ఉన్నతాధికారులు పెద్ద కార్యక్రమం...లేదా..శంకుస్థాపన చేయడానికి వస్తే మాత్రం చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారని ఆక్షేపిస్తున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన కార్పొరేటర్ చాలా మందికి తెలియకపోవడం గమనార్హం. నిరుపేదల అవసరాలు తీరేందుకు ఎవరిని కలవాలో తెలియని పరిస్థితి నెలకొంది. వార్డులోని ముఖ్య ప్రాంతాలైన డాబాగార్డెన్స్, శారదాస్ట్రీట్, రంగాస్ట్రీట్, లలితాకాలనీ, ఎస్‌బీఐ కాలనీల్లో ఎక్కువగా మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలు జీవనం సాగిస్తుంటాయి.

సమన్వయలోపం


జీవీఎంసీ వార్డుల విభజన తరువాత 31వ వార్డుగా (అంతకుముందు 27వ వార్డుగా ఉండేది) రూపాంతరం చెందింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డులో అభివృద్ధి పనులు సరిగా జరగడం లేదన్నది స్థానికుల అభిప్రాయం. అభివృద్ధి అంశాలు, ప్రజల సమస్యలను పట్టించుకునేందుకు సరైన నాయకుడు కరవయ్యారని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం. గతంలో ఇక్కడ కార్పొరేటర్‌గా సేవలందించిన వానపల్లి రవికుమార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా అనాథ శవాలు, సామాజిక అంశాల్లో ముందుండేవారు. ఆయన గతించడంతో ఆయన సేవలను వారి కుటుంబ సభ్యులు సైతం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడ్డారని స్థానికులు చర్చించుకుంటున్నారు. వార్డులోని కూటమి నేతల మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయని వారికి సన్నిహితంగా ఉన్నవారే చెవులు కొరుక్కోవడం గమనార్హం. ఒకరికి సమాచారం ఇస్తే మరొకరికి ఇవ్వడం లేదు. కొందరు ఎమ్మెల్యే వర్గమైతే, మరికొందరు మరోవర్గంగా ఏర్పడి ఎడముఖం ...పెడముఖంగా ఉంటున్నారు.


ఫ్లెక్సీల్లోనే దర్శనం

పండుగలు...ఇతరత్రా వేడుకలొస్తే చాలా మంది నేతాగణం ఫ్లెక్సీలలో కనిపిస్తారని, ఏదైనా సమస్య చెప్పుకోవాలంటే మాత్రం కనిపించరని పలువురు విమర్శిస్తున్నారు. వార్డులో నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండేలా కూటమి పెద్దలు సమన్వయం చేసుకోవాలని మేధావులు సూచిస్తున్నారు.

కేకే లైన్ క్లియర్

గంటల వ్యవధిలోనే ట్రాక్‌పై మట్టి, రాళ్లు తొలగింపు


ట్రాక్‌పై పడిన బండరాయి


తొలగించాక ఇలా...

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ముందుగానే అవసరమైన ప్రాంతాలకు సహాయక బృందాలు, అవసరమైన సామగ్రిని తరలించడంతో కొద్దిగంటల్లోనే ట్రాక్ క్లియరెన్స్ చేయగలిగారు. భారీవర్షాలు కురిసినప్పుడు కొత్తవలస-కిరండూల్ మార్గంలో కొండ చరియలు విరిగి మట్టి, రాళ్ల ట్రాక్‌పైకి వచ్చి చేరుతుంటాయి. ఈసారి కూడా అలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే ఆయా ప్రాంతాలకు బృందాలను తరలించారు. మంగళవారం రాత్రి చిమిడిపల్లి వద్ద బండరాళ్ల ట్రాక్‌పై పడి కొన్ని టన్నెల్‌లోకి వెళ్లాయి. దాంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమాచారం అందిన వెంటనే సమీపంలోనే ఉన్న సహాయక బృందాలు వెళ్లి గంటల వ్యవధిలోనే రాళ్లను తరలించి ట్రాక్, టన్నెల్‌ను క్లియర్ చేశాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లను రెండు రోజుల నుంచి నడపడం లేదు. కేవలం గూడ్స్ రైళ్లనే నడుపుతున్నారు. 24 గంటల తరువాత పాసింజర్ రైళ్లను కూడా అనుమతిస్తామని వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పల్లా పర్యటన

- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు శ్రీనివాసరావు ఆదేశం
- వర్షాల ధాటికి దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీల పరిశీలన

అగనంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని పలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ, తలారివానిపాలెం, దువ్వాడ ప్రధాన రహదారి, బొర్రమ్మ గెడ్డ, ఫార్మాసిటీ పునరావాస కాలనీలను సందర్శించారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందించాలని అధికారులకు సూచించారు. దువ్వాడ రహదారిలో నీటి నిల్వలు లేకుండా డ్రైనేజీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుఫాన్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. పల్లా వెంట జోనల్ కమిషనర్ శేషాద్రిరావు, టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, గొల్లవిల్లి కనకభవానీ, డొక్కా రమేశ్, వసంతరావు, బండారు చందూరమేశ్, బి.సత్యనారాయణ, తిలక్, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: మొంథా తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడం, రహదారులు చెరువులుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీ, సాయిరామ్‌నగర్, తలారివానిపాలెం ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజలు పల్లాకు వినతిపత్రం సమర్పించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు పూర్ణానారాయణ, జడ్సీ శేషాద్రి, క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్, కూటమి నాయకులు కాదా శ్రీను, బొడ్డేడ జగదీశ్, కొర్లాన రమేశ్, ఎం.గణపతి, కేవీ సుబ్బయ్య, రాయుడు నాగార్జున, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.




ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రమ్మ గెడ్డను పరిశీలిస్తున్న పల్లా శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శేషాద్రి, తదితరులు

జగ్గు జంక్షన్-పోర్టు రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి

గాజువాక: గాజువాక జగ్గు జంక్షన్-పోర్టు రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. జగ్గు జంక్షన్ రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ రోడ్డులో బాగా గోతులు పడడంతో వాహనదారులు తీవర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే గాజువాకలోని పలు ప్రాంతాల్లో పల్లా పర్యటించారు. కార్యక్రమంలో జడ్సీ శేషాద్రి, సీఐ పార్థసారథి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు అక్కిన లక్ష్మణరావు, కె.కనకారావు, బి.గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



గోతులమయమైన జగ్గు జంక్షన్-పోర్టు రోడ్డును పరిశీలిస్తున్న పల్లా శ్రీనివాసరావు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

గెడ్డలో చెత్తాచెదారం తొలగింపు

గాజువాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని ఎక్స్‌కవేటర్ల సాయంతో సజావుగా ముందుకు పారేలా మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు చర్యలు చేపట్టారు. ప్రధానంగా గాజువాక నుంచి గంగవరం సముద్ర తీరానికి ఉన్న ప్రధాన గెడ్డలో పలుచోట్ల చెత్తాచెదారం, పూడిక చేరడంతో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు కాలనీ, నడుపూరులోని పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. సకాలంలో స్పందించిన అధికారులు ఎక్స్‌కవేటర్ల సాయంతో గంగవరం పోర్టు వద్ద గల ప్రధాన కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించి వర్షపు నీరు సముద్రంలోకి సులువుగా చేరేలా చర్యలు చేపట్టారు. జోనల్ కమిషనర్ శేషాద్రితో పాటు ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, తాతారావులు సిబ్బందితో ఆయా పనులు చేయించారు. గాజువాకలో ప్రత్యేక అధికారి దయానిధి, తహశీల్దార్ బి.శ్రీనివాసరావులు బుధవారం కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తుఫాన్ వల్ల గాజువాకలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని వారు పేర్కొన్నారు.

నేడు సాయి ఏకధాటి నామ జపం

అగనంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయి మందిరంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి 24 గంటల పాటు 'ఓం సాయి శ్రీసాయి' ఏకధాటి నామాన్ని జపించనున్నట్టు షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించి శుక్రవారం ఉదయం 6 వరకు కొనసాగిస్తామన్నారు. సాయి భక్తులతో పాటు కమిటీ సభ్యులు, భజన బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భారీ వర్షం: పొంగి ప్రవహించిన గెడ్డలు

అగనంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో బుధవారం కూడా అగనంపూడి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన గెడ్డలు నీటితో పొంగి ప్రవహించాయి. తలారివానిపాలెం వద్ద రైల్వే ట్రాక్ అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిపై, కింద పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. అన్నపూర్ణానగర్ వద్ద గెడ్డ పొంగడంతో నీరు ప్రధాన రహదారిపై నుంచి పారింది. దీంతో రోడ్డు కనిపించలేదు. స్థానికులతో పాటు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. కాగా కొండవాగు నుంచి వచ్చే బొర్రమ్మ గెడ్డలో నీరు ఉధృతంగా ప్రవహించింది. స్టీల్ ప్లాంట్, దువ్వాడ ప్రధాన రహదారిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

బాధితులకు ఆహారం, దుప్పట్లు పంపిణీ

పెదగంట్యాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సీడబ్ల్యూసీ సెంటర్‌లో పునరావాసం కల్పించిన తుఫాన్ బాధితులకు 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మంగళవారం రాత్రి తాగునీరు, ఆహారం, దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే బుధవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో, పూరిళ్లలో, గెడ్డకు సమీపంలో నివసిస్తున్న వారికి సీడబ్ల్యూసీలో తాత్కాలికంగా పునరావసం కల్పించగా, వారికి బాసటగా కార్పొరేటర్ నిలిచారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఐవో

కూర్మన్నపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో వైద్యులకు ప్రత్యేక విధులను ఉన్నతాధికారులు కేటాయించారు. 24 గంటలూ అందుబాటులో ఉంటేలా మూడు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కణితి పీహెచ్‌సీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) లూసీ కోర్డలియా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఐఎల్ఆర్, డీప్ ఫ్రైజర్, లేబోరేటరీ రికార్డులను పరిశీలించారు. వైద్యులు స్వరూపారాణి, ధనలక్ష్మి, బాబీ, ఎంపీహెచ్ఈవో, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్, ఏఎన్ఎంలకు పలు సూచనలు చేశారు.

పక్షవాతాన్ని అరికట్టవచ్చు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు సరైన ఆహార అలవాట్లను అలవరుచుకోవడం ద్వారా పక్షపాతం వంటి వాటిని అరికట్టవచ్చని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ సీహెచ్ విజయ్ అన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా బుధవారం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షవాతానికి గురైనప్పుడు మొదటి నాలుగు గంటలు అతి ముఖ్యమని, పక్షవాతాన్ని సకాలంలో గుర్తించడంతో పాటు సరైన వైద్యాన్ని అందిస్తే రోగి త్వరగా కోలుకుంటాడన్నారు. అందరూ వ్యాయామం చేయడాన్ని అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



మహిళకు చెక్కు అందజేస్తున్న అక్కిన లక్ష్మణరావు

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గాజువాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని టీడీపీ 72వ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును బాధిత మహిళ సుంకపల్లి బేబీ రాణికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా కొంత మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ కన్నారావు, దాసరి విజయసాయి, బసవరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. 88వ వార్డు దువ్వాడకు చెందిన సారిపల్లి బాలరాజుకు ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. ఆయన ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.91 వేల చెక్కును బుధవారం బాలరాజు తండ్రి యర్రయ్యకు గండి బాబ్జీ స్థానిక నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, నాయకులు శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



అబ్దుల్ ఖాన్

గాజువాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిల్వ చేసిన కేసులో పరారీలో ఉన్న నిందితుడిని గాజువాక పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న శ్రీనగర్ ప్రాంతంలో గంజాయి నిల్వ ఉంచినట్టు అందిన సమాచారం మేరకు గాజువాక పోలీసులు దాడి చేసి 180 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో 10 మందిని అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో ప్రధాన ముద్దాయి అయిన ఒడిశాకు చెందిన అబ్దుల్ ఖాన్ (26) పరారయ్యాడు. కాగా నిందితుడు ఒడిశాలో ఉన్నట్టు పోలీసులు నిర్ధారించుకుని అక్కడకు వెళ్లి అరెస్టు చేశారు.

కూలిన పాఠశాల ప్రహరీ



వెంకటాపురం ఉన్నత పాఠశాలలో కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గోపాలపట్నం మండలం హెచ్‌సీ. వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. వర్షాల కారణంగా పాఠశాలలు సెలవు ఇవ్వడంతో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం కూలిన ప్రహరీని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ఆనందపురం మండలం సిర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, నగరంలోని సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీలు కూడా కూలిపోయాయి.



పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పక్కన తహశీల్దార్ వెంకట అప్పారావు తదితరులు



సింధియా: ఏకేసీ కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



తుఫాన్ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన గోపాలపట్నం ప్రధాన రహదారి

తుఫాన్ మిగిల్చిన నష్టం

- పునరావాస కేంద్రాన్ని సందర్శించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు
- ఏకేసీ కాలనీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పర్యటన
- పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు
- చెరువులను తలపిస్తున్న లోతట్టు ప్రాంతాలు
- పొంగి పార్లుతున్న గెడ్డలు

విరిగిన చెట్ల కొమ్మలు.. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. కోతకుగురైన రహదారులు.. పేరుకుపోయిన బురద.. కూలిన గోడలు.. వెన్ను ఒరిగిన పంటలు.. మినీ చెరువులుగా మారిన లోతట్టు ప్రాంతాలు.. పొంగిపొర్లుతున్న గెడ్డలు.. ఇంటిపైనే ధ్యాస పెట్టుకుని, పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమని జీవనం సాగిస్తున్న బాధితులు.. మేమున్నామంటూ ధైర్యం చెప్పే ప్రజాప్రతినిధులు, అధికారులు.. తుఫాన్ తరువాత కనిపిస్తున్న దృశ్యాలివే!

పెందుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. ముందస్తు చర్యల వల్లే నష్టాన్ని నివారించగలిగామని ఎమ్మెల్యే పంచకర్ల అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో పంచకర్ల బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డిపాలెం జుత్తాడ మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు, పినగాడిలో కోతకు గురైన రహదారిని పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ 16 అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడుతూ భోజనం, టిఫిన్ సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. శాఖాపరంగా సమీక్షించి కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపుతామని తహశీల్దార్ వెంకట అప్పారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉగ్గిన దేవుడు, అయితి సింహాచలం, గొర్లె రామునాయుడు, కోరుపల్లి రామునాయుడు, సేనాపతి సోమశేఖర్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన మేయర్ పీలా

పెందుర్తిలో పునరావాస కేంద్రాన్ని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఏకలవ్య కాలనీ వాసులతో మాట్లాడి భోజనం, వసతి, వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న సాయం గురించి వివరించారు. వర్షాలు తగ్గేంత వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉంచాలని అధికారులకు సూచించారు.



వేపగుంట: సాయిదుర్గానగర్‌లో నిలిచిపోయిన వరదనీరు




పెందుర్తి: కోతకు గురైన రోడ్డు, నీట మునిగిన వరి పంట



వేపగుంటలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

మొంథా తుఫాన్ పెందుర్తి మండలంలో అలజడి సృష్టించింది. తుఫాను కారణంగా వీచిన ఈదురు గాలులకు గొరపల్లిలో 6 రాంపురంలో 2 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ సందర్భంగా వాటిని మరమ్మతులు చేపట్టారు. పినగాడి, ముదపాకలో వరి పంట కొంతమేర నీటి ముంపును గురై వెన్ను ఒరగడంతో వ్యవసాయాధికారి చంద్రావతి పంటను పరిశీలించి తగు సూచనలు చేశారు. పెందుర్తి ఏకలవ్య కాలనీలో వరద నీరు చేరి కాలనీ నీటి ముంపునకు గురవడంతో 52 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. వరద ఉధృతంగా ఉండడంతో చినముషిడివాడ, పెందుర్తి, సుజాతగర్, దొగ్గవానిపాలెం, నల్లక్వారీ, ద్రోణంరాజు నగర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

ఏకేసీ కాలనీలో కలెక్టర్ పర్యటన

సింధియా, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో బుధవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన ఏకేసీ కాలనీ, రాజీవ్ కాలనీల పరిస్థితిని నేరుగా స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులకు చర్యలు చేపడుతున్నామని, త్వరలో మిగతా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరిస్తామన్నారు. అనంతరం డ్రైన్ పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు గేదల రమణ, జోన్5 కమిషనర్ బి.రాము, ములగాడ తహశీల్దార్ రమేశ్‌నాయుడు, శానిటరీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిపొర్లిన గెడ్డలు

వేపగుంట, ఎన్.ఎ.డి. (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వార్షలకు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జీవీఎంసీ 93వ వార్డులో దుర్గానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని ఉన్న కల్వర్టు చిన్నగా ఉండడంతో వరద నీరు పలు కాలనీల్లోకి చేరింది. దీంతో కొందరి ఇళ్లల్లోకి నీరు చేరడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా కల్వర్టును కొంచెం వెడల్పు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే 98వ వార్డు శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో పార్కును ఆనుకుని ఉన్న గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో విద్యుత్ స్తంభం, పార్కులోని కొన్ని చెట్లు ఒరిగిపోయాయి. 90వ వార్డు లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షం దాదాపు తగ్గడంతో కొండవాలు ప్రాంతాల వాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఆయన పేర్కొన్నారు.

చెరువులను తలపిస్తున్న లోతట్టు ప్రాంతాలు

గోపాలపట్నం, (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు ఎత్తి వరద నీరు విడుదల చేయడంతో కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సందర్భంగా కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో వరదనీరు ప్రవహించడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండవాలు ప్రాంతాల నుంచి గెడ్డల ద్వారా వచ్చే వరదనీరు, రిజర్వాయర్ నుంచి వచ్చిన వరదనీటితో కొత్తపాలెం గ్రామ శివారులో పరదేశమ్మనగర్, గణేశ్‌సాయినగర్ కాలనీల్లో వరదనీరు చేరింది. వరదనీరు ఇళ్లలోకి చేరడంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కొత్తపాలెం గ్రామ శివారులోని ముంపునకు గురైన గణేశ్‌సాయినగర్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో బాధితులకు కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకరమేశ్, టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బోసిపోయిన రహదారులు

తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోపాలపట్నంలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వర్షం కారణంగా కొనుగోలుదారులు బజారుకు రాకపోవడంతో ప్రధాన రహదారిలో వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి.

పారిశుధ్య కార్మికులతో పనులు చేయించిన సీఐ

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కాణంగా నీట మునిగిన మల్కాపురం-సింధియా రహదారిపై పేరుకుపోయిన బురదను తొలగించేందుకు మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు బుధవారం పారిశుధ్య కార్మికులతో దగ్గరుండి పనులు చేయించారు. తుఫాన్ నేపథ్యంలో ఆయన ప్రొటోకాల్ డ్యూటీ చేస్తూనే వరద బాధిత ప్రాంతంలో సేవలందించారు. తొలిరోజు వరద నీటిని తగ్గించేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో డివైడర్‌ను తవ్వించి నీటిని పంపించారు. రెండో రోజు కూడా రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వరద నీటిని తోడించారు. ఆయన సేవలను గుర్తించి పోలీసులు, స్థానికులు అభినందిస్తున్నారు.



మల్కాపురం: పారిశుధ్య పనులను చేయిస్తున్న సీఐ గొలగాని అప్పారావు

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 32, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 52, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో)70, అల్లం (పాతది) 70, బరబాటి48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు66, దోస కాయలు 28, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 32, కంద 48, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

పొదుపు.. మేలి మలుపు

ఆదాయంలో తప్పనిసరిగా 20 శాతం పొదుపు చేయాల్సిందే

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):

ఆర్థిక క్రమశిక్షణ.. ఈ మాట తరచూ వింటుంటాం. భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన ఉన్న వారే వచ్చిన ఆదాయాన్ని సరైన రీతిలో వెచ్చించి, ఆర్థిక ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకుంటారు. అయితే గత కొన్నాళ్లు గా ఎంతోమంది ఆర్థిక ప్రణాళిక లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. స్థోమతకు మించి ఖర్చు చేయడం, ఆడంబరాలకు పోయి జీవితాలను నాశనం చేసుకుంటు న్నారు. భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునేందుకు పొదుపు కీలకమని నిపుణులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పొదుపు దినోత్సవం సందర్భంగా కథనం.

- మిగిలినదిఅవసరాలు, రోజువారీ ఖర్చులకు వెచ్చించాలి
- అధిక ఆదాయాన్ని ఇచ్చే మార్గాలను అన్వేషించి పెట్టుబడి పెట్టడం కీలకం
- రానున్న పదేళ్లలో రెట్టింపవనున్న ఖర్చులు

నేడు అంతర్జాతీయ పొదుపు దినోత్సవం



ఎంత సంపాదించామన్నది కాదు.. ఎంత పొదుపు చేస్తున్నామన్నది భవిష్యత్తును నిర్దేశిస్తుంది. పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా అక్టోబరు 30న ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇటలీలోని మిలాన్ నగరంలో తొలిసారి 1924లో మొదటి అంతర్జాతీయ పొదుపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది పొదుపు, రక్షణ, చేరిక, అభివృద్ధి థీమ్‌తో నిర్వహి స్తున్నారు.

ఈ ఫార్ములా కీలకం..

పొదుపు చేయడమంటే ఖర్చులన్నింటికీ వెచ్చించగా మిగిలిన మొత్తాన్ని దాచడమని చాలా మంది భావిస్తుంటారు. ఇది తప్పు. ముందు పొదుపు చేయాలనుకునే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన సొమ్మును అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయడం అత్యుత్తమ పొదుపు మార్గం. ఇందుకోసం ఫైనాన్షియల్ అడ్వైజర్ ఒక సూత్రాన్ని సూచించారు. అదే 50- 30-20 ఫార్ములా. అంటే వచ్చిన ఆదాయంలో 50 శాతం రోజువారీ అవసరాలకు ఖర్చు చేయాలి. ఇంటి అద్దె, నిత్యావసరాలు, పిల్లల చదువులు వంటివి. 30 శాతాన్ని కోరికల కోసం వెచ్చించాలి. సినిమాలు, షికార్లు, టూర్లు, ఈఎంఐలు వంటివి. మిగిలిన 20 శాతాన్ని తప్పనిసరిగా ఆదా చేయాలి. లేదంటే భవిష్యత్తులో మరొకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాబడి వచ్చే వాటిపైనే...

ప్రతినెల ఆదా చేసే మొత్తాన్ని అత్యుత్తమ రాబడి ఇచ్చే వాటిల్లో పెట్టుబడి పెట్టడం కీలకం. రూపాయి విలువ క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడున్న లక్ష రూపాయల విలువ పదేళ్ల తరువాత రూ.50 వేలకు సమానంగా మారవచ్చు. అప్పటి అవసరాలకు అనుగుణంగా ఎక్కువ రాబడి ఇచ్చే వాటిల్లో ఇన్వెస్ట్ చేయాలి. ఇందుకోసం బ్యాంకులు, పోస్టాఫీసులు, ఇతర సంస్థలు అందించే పథకాల్లో ఉత్తమమైనవి ఎంచుకోవాలి.

వృథా ఖర్చులకు దూరం..

వృథాగా చేసే ఖర్చులకు దూరంగా ఉండడం కీలకం. ఇటీవల విచ్చలవిడి ఖర్చు చేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇతరులతో పోల్చుకుని అవసరానికి మించి ఖర్చు చేసి చాలా మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆర్థిక స్థోమతపై అవగాహన లేకుండా రంగుల ప్రపంచం వైపు చూస్తే జీవితాలు నాశనమవుతాయి. ఆఫర్లకు చిక్కితే అత్యంత ప్రమాదమని గ్రహించాలి. అవసరమున్నా, లేకున్నా క్రెడిట్ కార్డులు తీసుకోవడం, ఆఫర్‌లో వచ్చిందని కొనడం, సమయానికి డబ్బులు చెల్లించలేక అప్పులు చేయడం పరిపాటిగా మారింది. వాటికి దూరంగా ఉంటేనే జీవితం ఆనందమయమవుతుంది.

భవిష్యత్తు ఆనందానికి కీలకం



ప్రతి ఒక్కరి ఆర్థిక జీవితంలో పొదుపు కీలకం. ఖర్చు చేయగా మిగిలిన మొత్తం పొదుపు చేసేందుకు చాలా మంది యత్నిస్తారు. కానీ పొదుపు చేయగా మిగిలినది ఖర్చు చేయడం అత్యుత్తమ ఆర్థిక ప్రణాళిక. ఎక్కువ రాబడికి ఎందులో ఇన్వెస్ట్ చేస్తున్నామన్నది ముఖ్యం. రానున్న పదేళ్లలో ఖర్చులు పెరుగుతాయి. అందుకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళికలు ఉండాలి. లేదంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదురవకుండా, జీవితాన్ని సాఫీగా గడిపేందుకు పొదుపు కీలకం.

- **జి.రవివర్మ,** ఆర్వీ ఇన్‌స్పైర్ ఫైనాన్షియల్ ప్లానింగ్ స్ట్రాటజిస్ట్, మోటివేషనల్ స్పీకర్

ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోటు

- పరిశీలించిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మునిగిపోయిన బోటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

బీచ్ రోడ్డు, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో లంగర్ వేసిన బోటు మునిగిపోయింది. జాలారిపేట ప్రాంతానికి చెందిన బోటు యజమాని ఎం.ధనరాజ్ తుపాను హెచ్చరికతో నేపథ్యంలో ఆరు రోజుల కిందట ఫిషింగ్ హార్బర్‌లో తన బోటును పెట్టేసి వెళ్లిపోయాడు. బుధవారం చూసేసరికి బోటు మునిపోయి ఉంది. మొంథా తుఫాన్ ధాటికి ఫిషింగ్ హార్బర్‌లో అలల ఉధృతి ఎక్కువగా ఉండడం, భీకర గాలుల కారణంగా బోటు మునిగిపోయిందని భావిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఫిషింగ్ హార్బర్ వద్దకు చేరుకొని బోటు మునిగిపోయిన విషయం తెలుసుకొని వివరాలు సేకరించారు. సుమారు రూ. 30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

కిక్కిరిసిన చేపల రేవు ....

చేపల రేవులో, జెట్టీలు బోట్లతో కిక్కిరిసిపోయాయి. సముద్ర జలాల్లో వేట సాగిస్తున్న బోట్లు తుపాను నేపథ్యంలో ఒక్కొక్కటిగా చేపల రేవుకు చేరుకున్నాయి. ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న 11 జెట్టీల్లో బోట్లను కట్టేశారు. ప్రస్తుతం 600 బోట్లు ఇక్కడ ఉన్నాయి. తుఫాన్ కారణంగా గాలి ఉద్రిక్తత పెరగడంతో బోట్లు ఒకదానికొకటి తగిలి నష్టపోయే ప్రమాదం ఉండడంతో బోటు ఆపరేటర్లు, మత్స్యకారులను జేడీ లక్ష్మణరావు అప్రమత్తం చేశారు. విశాఖకు చెందిన 110 బోట్లు పారాదీప్, బావనపాడు, పూరి తీరాల్లో సురక్షితంగా ఉన్నాయని అక్కడ ఉన్న స్థానిక మత్స్యకారులు తెలిపారు.

తుఫాన్ సహాయక చర్యల్లో జీవీఎంసీ సఫలం

- యుద్ధప్రాతిపదికన 224 ఫిర్యాదులకు పరిష్కారం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టడంలో జీవీఎంసీ సఫలమైందని కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుపాటు కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు 229 ఫిర్యాదులు అందితే వాటిలో 224 ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించినట్టు తెలిపారు. కొండవాలు, లోతట్టుప్రాంతాల్లో 79 పునరావాస కేంద్రాలను సిద్ధంచేశామని, అందులో 13 కేంద్రాల్లోకి లోతట్టుప్రాంతాల నుంచి 293 మందిని తరలించి వారికి మౌలికవసతులు కల్పించామన్నారు. నగర పరిధిలో 160 చెట్లు కూలిపోగా వాటిలో 157 చెట్లను తొలగించామన్నారు. పది వీధి దీపాలు పడిపోవడంతో పునరుద్ధరించామన్నారు. డ్రైనేజీలు, యూజీడీలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించడం ద్వారా ముంపుసమస్య ఎదురవకుండా నిలువరించగలిగామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: డీఐజీ

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు, గాలులు సంభవిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి రైవాడ జలాశయం పరిసర ప్రాంతాలు, శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలంలోని బహుదా నది, అల్లూరి సీతారామ రాజు జిల్లాలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదముందని, వర్షాల తీవ్రత పెరిగే క్రమంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకోవాలన్నారు. అల్లూరి జిల్లా చత్రపల్లి, పులుసుమామిడి, మాదిరముల్లు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగి పడే ప్రమాదముందన్నారు.

వరద నీటితో ఉప్పొంగిన గోస్తనీ నది

- విజయనగరం-సింహాచలం మార్గంలో నిలిచిన రాకపోకలు
- పరీవాహక ప్రాంతంలో మునిగిన పంటపొలాలు

పద్మనాభం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోస్తనీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో పరీవాహన ప్రాంతంలోని పంట పొలాలు నీట మునిగాయి. తాటిపూడి రిజర్వాయరు నుంచి సుమారు ఐదువేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టడంతో నది ఉగ్రరూపం దాల్చింది. లోతట్టు ప్రాంతాలైన మద్ది, విలాస్కాన్‌పాలెం, కృష్ణాపురం, పాండ్రంగి, సామయ్యవలస తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదీ తీరాలకు, ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డల వద్దకు వెళ్లవద్దని సూచించారు. దీంతో పాటు మద్ది ఇసుక గెడ్డ, పొట్నూరులోని గెడ్డలపై ఉన్న కాజువేలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలను నిషేధించారు. దీంతో సింహాచలం-విజయనగరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



పద్మనాభంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న గోస్తనీ నది

పొంగిన చిప్పాడ ఉప్పుటేరు

భీమునిపట్నం (రూరల్) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో భీమిలి మండలం చిప్పాడ వద్ద గోస్తనీ నదికి అనుబంధంగా ఉన్న ఉప్పుటేరు ఉప్పొంగింది. చెరువు అంచులను దాటి రావడంతో ప్రధాన రహదారిపై మోకాలు లోతు నీరు చేరింది. దీంతో వాహన రాకపోకలు స్తంభించాయి. పరిసర ప్రాంతాల్లోని ఇళ్ల వద్దకు కూడా భారీగా నీరు చేరింది. అధికారులు బుధవారం ఈ ప్రాంతాన్ని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. నీటి ప్రవాహం పెరిగితే అన్నవరం, ఎరుసుపేట, కొత్తపేట, నాగమయ్యపాలెం, పాతపాలెం, పైలపేట తదితర 14 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతాయి. తగరపువలస జాతీయ రహదారిని చేరుకునేందుకు ఇదే దారి. ఉప్పుటేరుకు మరో పక్క గండి కొట్టడానికి అధికారులు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. పంట పొలాలు నీట మునిగిపోతాయని వాదిస్తున్నారు. మళ్లీ భారీ వర్షం పడితే మరింత ఎక్కువగా నీరు చేరుతుందని ఈ ప్రాంతీయులు భయాందోళనలో ఉన్నారు.



పద్మనాభం మండలంలోని మద్ది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



చిప్పాడ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

మేహాద్రి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల




మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో మూడు రోజులుగా గేట్లను తెరిచి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఒక గేటును దించారు. ప్రస్తుతం మూడు గేట్లద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా ప్రస్తుతం 60 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు.

సింహగిరి మెట్లమార్గంలో బండరాళ్లు

- తొలగించడంలో ఇంజనీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యం

సింహాచలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు సింహగిరి మెట్లమార్గంలో సాక్షి అంజనేయస్వామి దేవాలయం వద్దకు కొన్ని బండరాళ్లు దొర్లుకుని వచ్చాయి. రెండురోజులైనా వాటిని తొలగించడంలో దేవస్థానం ఇంజనీరింగ్ సిబ్బంది దృష్టి సారించలేదు. తక్షణం వాటిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.



మెట్లపైకి వచ్చిన బండరాళ్లు

బీచ్‌రోడ్డులో గ్రీనరీ అభివృద్ధి పనులు



సీతకొండ మలుపులో నాటేందుకు సిద్ధం చేసిన వివిధరకాల మొక్కలు

విశాలాక్షినగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నిర్వహించే పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు (30 ఎట్ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025) నగరం ముస్తాబవుతోంది. ఇప్పటికే రహదారుల సెంటర్ మీడియన్లకు రంగులను వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా సీతకొండ బీచ్‌రోడ్డులో పూలమొక్కలను నాటి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా సీతకొండ మలుపులో మొక్కలను డంప్ చేశారు. జీవీఎంసీ హార్టీకల్చర్ విభాగం ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

వసతి గృహ భవనాలను తనిఖీ చేసిన ఏయూ వీసీ



వసతిగృహం భవనాల పరిస్థితిని తెలుసుకుంటున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వసతి గృహ భవనాలను వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో భవనాలు, రక్షణ గోడల పరిస్థితి, హాస్టల్స్, ఇతర భవనాల ను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. టీఎల్ఎన్ సభా హాల్‌కు వెళ్లి అక్కడ ప్రహరీగోడలు, భవనం తదితర అంశాలను పరిశీలించారు. వర్సిటీ రక్షణ గోడలు దెబ్బతినకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్కేడీ హాస్టల్‌ను సందర్శించిన వీసీ గదులను పరిశీలించారు. పర్యటనలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, డీన్ కె.శ్రీనివాసరావు, సీహెచ్ ఆశ ఇమ్మానియేల్, ఇంజనీర్ తిరుపతిరావు తదితరులున్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.48 లక్షలు

మహారాణిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా సుమారు రూ.48 లక్షల ఆదాయం లభించింది. ఆగస్టు 20 నుంచి ఈ నెల 29 వరకు హుండీల్లో వేసిన కానుకలను బుధవారం లెక్కిం చారు. ఇందులో అమ్మవారికి 48,07,930 నగదు, 61.510 గ్రాముల బంగారం, 941 గ్రాముల వెండి, 33 అమెరికన్ డాలర్లు లభించినట్టు ఈవో కె.శోభారాణి తెలిపా రు. వీటితోపాటు విదేశీ నగదు మరికొంత వచ్చినట్టు పేర్కొన్నారు. ఈవోలు కె.శోభారాణి, టి.రాజగోపాలరెడ్డి, సహాయ కార్యనిర్వాహక అధికారులు ఎన్.ఆనంద్ కుమార్, కె.రాజేంద్రకుమార్, ఎంవీ రమణ, ఎస్.కనకరాజు, కె.పద్మజ, బ్యాంక్ అధికారులు, పోలీసు సిబ్బంది, పలువురు దేవాలయ అధికారులు పాల్గొన్నారు.




హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

దేవదాయ శాఖలో ఇద్దరికి పదోన్నతి

మహారాణిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో పని చేస్తున్న ఇద్దరు గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ అధికారులు పదోన్నతి పొందారు. టర్నర్ చౌల్రీ ఈవో అల్లు జగన్నాథరావు, ఎస్.కోట కోటమ్మ అమ్మవారి ఆలయ ఈవో జి.శ్రీనివాసరావు గ్రేడ్-1 అధికారులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు బుధవారం దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ పునరుద్ధరణలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ



విద్యుత్ పునరుద్ధరణ పనులపై డైరెక్టర్లతో సమీక్షిస్తున్న ఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తరువాత ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ పునరుద్ధరణ చర్యలను తిరుపతి నుంచి వచ్చిన ఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ బుధవారం కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టరతో సమీక్షించారు. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ కోస్తా జిల్లాలోని సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో విశాఖలో కార్యక్రమాల నిర్వహణకు శివశంకర్‌ను చీఫ్ సెక్రటరీ విజయానంద్ పంపించారు. ఏయే అధికారులు ఎక్కడెక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. సహాయక కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో డైరెక్టర్ డి.చంద్రం, టి.వనజ, సీజీఎం విజయలలిత, ఎస్ఈ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణంలో అనేక లోపాలు

- విజయనగరం డైవర్షన్‌లో నిలిచిన వరదనీరు

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి భోగాపురం మీదుగా శ్రీకాకుళం వెళ్లే 16వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. మధురవాడ, తగరపువలస ప్రాంతాల్లో వర్షం పడితే సబ్‌వేల వద్ద, సర్వీసు రోడ్డులో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోతోంది. దీనిపై గతంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆ శాఖ అధికారులతో చర్చించారు. నీరు నిలిచిపోకుండా తగిన చర్యలు చేపట్టమని ఆదేశించారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. తాజాగా తగరపువలస దాటిన తరువాత విజయనగరం వెళ్లేందుకు (ఎన్‌హెచ్-43) ఎడమ వైపు మార్గంలోకి మళ్లాల్సిన చోట పెద్దఎత్తున వరద నీరు నిలిచిపోయింది. సుమారుగా 300 మీటర్ల పొడవున నీరు నిలిచిపోవడంతో అధికారులు బుధవారం అక్కడ రోడ్డుకు అడ్డంగా తాళ్లు కట్టేశారు. ఒక వాహనాన్ని అడ్డంగా పెట్టి, మనిషిని పెట్టి ముందుకు వెళ్లి విజయనగరం మలుపు తీసుకోవాలని సూచించారు. ఆ వరద నీటిని దారి మళ్లించే పనులు మాత్రం చేపట్టలేదు. సాయంత్రం వరకు అదే పరిస్థితి కొనసాగింది. తక్షణమే ఈ లోపాలపై జిల్లా అధికారులు సమీక్షించి, తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



వాహనాన్ని అడ్డుపెట్టి వాహనాలను మళ్లిస్తున్న వైనం, విజయనగరం రోడ్డులో నిలిచిన నీరు